ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు - గరిష్ఠం : 40.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

5

అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 18 మార్చి 2025



పొట్టిశ్రీరాములు స్కూల్‌లో పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు



అనంతపురం మొదటి రోడ్డు శివాలయంలో మంగళహారతి తీసుకుంటున్న విద్యార్థులు

టెన్షన్

తొలిరోజు

పది పరీక్షలు ప్రారంభం

తల్లిదండ్రులతో కలిసి వచ్చిన విద్యార్థులు

అంతకు మునుపు ఆలయాల్లో మొక్కులు

తొలిరోజు 638 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద తల్లిదండ్రులు, విద్యార్థుల హడావుడి కనిపించింది. తొలిరోజు కావడంతో కొందరు విద్యార్థులు కంగారుగా కనిపించారు. తల్లిదండ్రులు వారికి ధైర్యం చెప్పి పంపించారు. అంతకు ముందు ఉదయాన్నే పలువురు విద్యార్థులు ఆలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్, ఓపెన్ పరీక్షలు 135 కేంద్రాల్లో జరుగుతున్నాయి. పరీక్షలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైనా.. 7.30 గంటల నుంచే విద్యార్థులు రావడం ప్రారంభించారు. వారిని 9 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. రెగ్యులర్ విద్యార్థులు 30,906 మందికి గాను 30,305 మంది హాజరయ్యారు. 601 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 263 మందికిగాను 226 మంది హాజరయ్యారు, 37 మంది గైర్హాజరయ్యారు. డీఈఓ ప్రసాద్‌బాబు ఒక పరీక్షా కేంద్రాన్ని, జిల్లా పరీక్షల అబ్జర్వర్ మూడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. 30 సిట్టింగ్ స్క్వాడ్స్, ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్స్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి.



అనంతలోని శారదా స్కూల్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి



టెన్షన్ పడొద్దు నాన్నా.. జాగ్రత్తగా రాయి..

తాగునీటి సమస్య రాకూడదు

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

అనంతపురం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): 'వేసవి వచ్చేసింది. ఎండలు మండుతున్నాయి. ఎక్కడా తాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి' అని అధికారులను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 380 మంది వచ్చి తమ సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. కలెక్టర్‌తోపాటు జేసీ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్లు రామక్రిష్ణారెడ్డి, మల్లికార్జున, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. పైపులైన్లు పగిలినా, లీకేజీలు ఏర్పడినా వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, అవసరమైన చోట నీటి పరీక్షలు చేయించాలని సూచించారు. ఆసుపత్రుల్లో అవసరమైన ఔషధాలు ఉండేలా చూడాలని అన్నారు. కేంద్రప్రభుత్వ పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. 500 మంది ఉన్న తండాల్లో జీవనోపాధికి అవకాశం కల్పించాలన్నారు. ఈ పథకానికి జిల్లాలో గుండాల తండా, వెంకటంపల్లితండా, వెంకటంపల్లిపెద్దతండా, చిన్నవరం, నాగులగుడ్డం తండాలను ఎంపిక చేశామని అన్నారు. తొమ్మిదేళ్లుగా కేంద్రం అందించే ఎక్సలెంట్ అవార్డు జిల్లాకు దక్కలేదని, ఈసారి వచ్చేలా అన్ని శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఈ నెల 22న అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో మన వ్యవసాయం, మన పంటలు, వంటలు, ఆరోగ్యం అనేకార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. మూడురోజులుపాటు నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పది ప్రశ్నాపత్రం గల్లంతు

ఓపెన్ పరీక్ష విధుల్లో నిర్లక్ష్యం

గోప్యంగా ఉంచిన విద్యాశాఖ అధికారులు

రాయదుర్గం సీఎస్, డీఓ సస్పెన్షన్...?

అనంతపురం విద్య, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాయదుర్గంలో పదో తరగతి ఓపెన్ పరీక్షల ప్రశ్నాపత్రం సోమవారం గల్లంతైంది. విశ్వసనీయ సమాచారం మేరకు, పరీక్షల విధుల్లో ఉన్న సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రశ్నాపత్రాల బండిల్ మిస్ అయింది. తర్వాత మరో సెంటర్ నుంచి ప్రశ్నాపత్రాలు తెప్పించి పరీక్షలు నిర్వహించారు. దీనికి కారణమైన చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్(డీఓ)ను సస్పెండ్ చేశారని తెలిసింది. ప్రశ్నాపత్రాల బండిల్ రాత్రి 9 గంటల వరకూ దొరక్కపోవడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఈ ఘటనను పరీక్షల విభాగం, విద్యాశాఖ అధికారులు గోప్యంగా ఉంచారు.

పోలీస్ స్టేషన్ నుంచి తెచ్చే క్రమంలో..

జిల్లాలో 11 కేంద్రాల్లో ఓపెన్ టెన్త్ పరీక్షలు జరుగుతున్నాయి. అనంతలో 4, రాయదుర్గంలో 4, తాడిపత్రిలో 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 28 వరకూ పరీక్షలు జరుగుతాయి. మొత్తం 1,114 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. హిందీ పరీక్ష సోమవారం జరిగింది. రాయదుర్గంలో ఒక పరీక్షా కేంద్రానికి సంబంధించి సీఎస్, డీఓ పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్నాపత్రం బండిల్ తెచ్చే క్రమంలో మిస్ చేశారు. వారు తమ వాహనంలో కాకుండా, అపరిచితుడి వాహనంలో ప్రశ్నాపత్రం బండిల్ పెట్టారని, అతను బండిల్‌తో పరారయ్యాడని విశ్వసనీయంగా తెలిసింది. దీంతో దిక్కుతోచక మరో సెంటర్ నుంచి ప్రశ్నాపత్రం తెచ్చి పరీక్షలు జరిపించారు. డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు తనిఖీకి వెళ్లి, ప్రశ్నాపత్రాల బ్యాలెన్స్ చెక్ చేయడంతో అసలు విషయం బయటపడింది. ఆయన ఈ విషయాన్ని ఆర్‌జేడీ శామ్యూల్ దృష్టికి తీసుకువెళ్లారు. డీఈఓ ప్రసాద్‌బాబును ఆర్‌జేడీ వెంటనే రాయదుర్గం పంపించారు. ఈ వ్యవహారంపై విద్యాశాఖలో ఉత్కంఠ నెలకొంది. ఈ ఘటనకు బాధ్యులైన ఆ సెంటర్ సీఎస్, డీఓను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. డీఈఓ, ఆర్‌జేడీ ఫోన్లలో అందుబాటులోకి రాలేదు.

స్థలం విషయంలో ఘర్షణ

13 మందిపై కేసు నమోదు

రాప్తాడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ జన్మభూమి నగర్‌లో రెండు సెంట్ల స్థలం విషయంలో ఆదివారం సాయంత్రం ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో పలువురు గాయపడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన గొర్తి లక్ష్మీనారాయణ, అనిల్ ప్రస్తుతం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా... పార్వతమ్మ అనే మహిళ అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో మరో వర్గానికి చెందిన చంద్రకళ కూడా గాయపడి చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 13 మందిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రాప్తాడు పోలీసులు తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.32 (మంగళవారం సాయంత్రం)

సెహరీ : 5.08 (బుధవారం ఉదయం)

రాలిన ఆశలు

బోసిపోయిన మామిడి తోటలు



ఫిబ్రవరిలో విరబూసిన పూత



మార్చిలో బోసిపోయిన కొమ్మలు

కనగానపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఫిబ్రవరిలో వాతావరణం అనుకూలంగా ఉండటంతో విపరీతంగా పూత పూశాయి. దీంతో తమ 'పంట' పండుతుందని రైతులు సంతోషించారు. అదే ఊపులో భారీగా ఖర్చు చేసి మందులు పిచికారీ చేశారు. ఎకరానికి రూ.30వేలు పెట్టుబడి పెట్టారు. మార్చి నెల వచ్చేసరికి పూత మొత్తం రాలిపోతోంది. చెట్లన్నీ బోసిపోయాయి. పగలు ఎండలు, రాత్రి చల్లదనం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పు చేసి పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు.



రాలిపోయిన మామిడి పిందెలు

రాలుతున్న ఆశలు 7లో

ప్రాణదాత టెనెక్టెప్లాస్


గుండెపోటు బాధితులకు భరోసా

తొలి గంటలోపు వస్తే ప్రాణాలకు రక్ష

ఉచితంగా ఖరీదైన ఇంజక్షన్లు

సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో అందుబాటు

ఒక్కో ఇంజక్షన్ రూ.40 వేలకు పైనే..



అనంతపురం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గుండెపోటు జనాలను బెంబేలెత్తిస్తోంది. చిన్నాపెద్దా తేడా లేకుండా అనేకమంది ఆకస్మికంగా గుండెపోటు బారిన పడుతున్నారు. కొందరు ప్రాణాలు కోల్పోతుండగా.. మరికొందరు శస్త్ర చికిత్సలు చేయించుకుని జీవితాంతం అవస్థలుపడుతున్నారు. వైద్యాధికారుల లెక్కల మేరకు జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవ(ఆరోగ్యశ్రీ) కింద దాదాపు ఏడాదిలో 20వేల మంది గుండెకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా వైద్యం పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆకస్మికంగా గుండె పోటుకు గురయ్యే వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. గుండెపోటుకు గురైనవారు గంటలోనే ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే టెనెక్టెప్లాస్ అనే ఇంజక్షన్ వేస్తే ప్రాణాపాయం నుంచి బయటపడడానికి అవకాశం ఉంటుంది. ఈ ఇంజక్షన్ విలువ రూ.40 వేలు ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల్లో సిద్ధం..

రాష్ట్ర ప్రభుత్వం గుండెపోటు బాధితుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. గతంలో ఎవరైనా గుండెపోటుకు గురైతే చికిత్స కోసం జిల్లా సర్వజనాసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ లేదంటే జిల్లా కేంద్రంలోని వివిధ ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించేవారు. ఇక్కడికి వచ్చేలోపే తీవ్రమైన గుండెపోటుకు గురైన బాధితులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉండేవి. దీంతో ప్రభుత్వం గుండెపోటు బాధితులకు అత్యవసరమైన చికిత్సలు అందించి ప్రాణాలు కాపాడేందుకు టెనెక్టెప్లెస్ ఇంజెక్షన్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సూదులను ఇపుడు జిల్లాలోని కళ్యాణదుర్గం, గుత్తి, పామిడి, కొనకొండ్ల, ఉరవకొండ, శింగనమల, కణేకల్లు, రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, అనంతపురం పాతూరులోని సీడీ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచారు.

తొలి గంటలో వస్తే ప్రాణాలకు రక్ష

గుండెకు సంబంధించిన సమస్యలు వచ్చినపుడు నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు చెబుతున్నారు. గుండెదడ, చాతిలో నొప్పి, ఆయాసం, ఎడమ భుజం లాగడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా తొలిగంటలోనే ఆసుపత్రికి చేరుకోవాలి. అక్కడ డాక్టర్లు పరీక్షించి స్టెమీ యాప్‌లో గుండెవ్యాధి నిపుణులకు వాట్సాప్‌లో పంపుతారు. వారు వాటిని పరిశీలించి అవసరమైతే వెంటనే టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ వేయాలని సూచిస్తారు. అపుడు సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల్లో ఉన్న డాక్టర్లు ఇంజక్షన్ వేస్తారు. అది గుండెపోటును నివారించగలుగుతుంది. జిల్లాలో ఈ సూదులను అందుబాటులో ఉంచారు. ఇప్పటికే సుమారు 250 మందికి పైగా బాధితులకు ఈ ఇంజక్షన్లు ఇచ్చిప్రాణాలు కాపాడారు.

అందుబాటులో ఇంజక్షన్లు



గుండెపోటు బాధితులను రక్షించడానికి టెనెక్టెప్లెస్ ఇంజక్షన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ సూది ఖరీదు రూ.40వేలు. ఇంత విలువైన సూదులను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది. ప్రతి సీహెచ్‌సీలోను రెండు, ఏరియా ఆసుపత్రులలో మూడు ఇంజక్షన్ల చొప్పున తప్పనిసరిగా ఉంచుతున్నాం. ప్రతిచోటా అత్యవసర బాధితులకు వినియోగిస్తున్నారు. ఎక్కడైనా అయిపోతే వెంటనే సరఫరా చేస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో 250మందికి పైగా వినియోగించాం. 99 శాతం మంది ప్రాణాలు కాపాడాం. ప్రజలు సకాలంలో ఆసుపత్రులకు చేరుకొని ప్రాణాలు కాపాడుకోవాలి.

- డాక్టర్ పాల్ రవికుమార్, డీసీహెచ్‌ఎస్, అనంతపురం

టిప్‌టాప్ సార్

అక్రమ వసూళ్లలో టాప్.. పైసలిస్తేనే భూమి కొలతలు

అనంత సర్వే విభాగంలో ఓ అధికారి ఇష్టారాజ్యం



మండల సర్వేయర్ కార్యాలయం



అనంతపురంరూరల్, మార్చి17(ఆంధ్రజ్యోతి): ఆయన అనంతపురం తహసీల్దార్ కార్యాలయం సర్వే విభాగంలో ఓ అధికారి. ఆయనను చూస్తే ఎవరైనా సరే ఈయన అలా కనిపించడం లేదే అంటారు. ఆయన గురించి తెలిసినవారు...పనిచేయించుకున్నవారిని టచ్ చేస్తే అసలు సంగతి చెబుతారు. టిప్ టాప్‌గా మెతక వైఖరితో ఉంటూ వసూళ్లలో టాప్ లేపేస్తున్నారు. పైసలిస్తేనే కొలత అన్న రీతిలో ఆయన వ్యవహారం సాగిస్తున్నారు. సెంటు స్థలం కొలత వేయాలన్నా వేలలో ముట్టచెప్పాల్సిందేనన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

రూ.లక్ష ఉంటేనే...

కనీసం రూ.లక్ష పైనా ముట్టచెప్పితేనే ఆయన కొలతకు వెళ్తారంట. ఆ రేంజ్‌లో ఉన్న వాటికే తొలిప్రాధాన్యం ఇస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ఓ సెంటు స్థలం కొలత వేయాలన్నా కనీసం రూ.పదివేలకు పైగా అప్పగించాల్సిందేనట. దీనికితోడు అనంతపురం అర్బన్, రూరల్ ప్రాంతాలతో పాటు మున్సిపాల్టీకి కూడా ఆయనే అధికారి కావడంతో డిమాండ్ కూడా బాగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఆయన అక్రమ సంపాదన కూడా అంతకంతకూ పెరుగుతున్నట్లు సమాచారం.

ఉద్యోగులపట్ల దురుసు ప్రవర్తన

ఇదిలా ఉండగా ఆయన తన కంటే కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బంది పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. సమావేశాల్లో, టెలీకాన్ఫరెన్స్‌లలో ఇష్టారాజ్యంగా మాట్లాడినట్లు సమాచారం. నోటికి ఏదొస్తే అది అనేస్తారని, ఆడమగ అన్న తేడా కూడా లేకుండా అసభ్య పదజాలంతో దూషిస్తారని బాధిత వర్గాలు వాపోతున్నాయి. ఒక సందర్భంలో ఓ మహిళా ఉద్యోగి ఆ అధికారికి గట్టిగానే సమాధానం ఇచ్చినట్లు ఆయా వర్గాల సమాచారం. అయినా అయనలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని తెలుస్తోంది.

కార్యాలయంలో కనిపించడం అంతంతే..

ఈయన విధుల్లో చేరినప్పటి నుంచి కార్యాలయంలో కనిపించడం అంతంత మాత్రంగానే ఉంటోంది. నిత్యం ఆదాయమున్న వాటికే ప్రాధాన్యం ఇస్తూ..మిగిలిన వాటిని పట్టించుకోరని తెలుస్తోంది. ఎవరైనా కార్యాలయం వద్ద ఆ అధికారిని ప్రశ్నించినా పొంతనలేని మాటలతో సమాధానాన్ని దాటి వేస్తారని తెలిసింది. రీ సర్వే, కొలతకు ఆ గ్రామానికి..ఈ గ్రామానికి వెళ్లాం అంటున్నట్లు తెలుస్తోంది. రూరల్ మండలం పరిధిలోని తాటిచెర్ల గ్రామంలో రీ సర్వే ప్రారంభమై దాదాపు రెండు మూడు నెలలు కావస్తోంది. ఆ అధికారి రీసర్వేకు వెళ్లిన దాఖలాలు చాలా తక్కువే. మున్సిపాల్టీ పరిధిలో కొలతలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇక్కడ పెద్దమొత్తంలో ముడుపులు వస్తుండటంతో ఇక్కడి వాటికే తొలి ప్రాధాన్యం ఇస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎవరూ ఫిర్యాదు చేయలేదు

సర్వేయర్ గురించి ఎవరూ ఎలాంటి ఫిర్యాదులు చేయలేదు. కిందిస్థాయి ఉద్యోగులు ఫిర్యాదు చేయలేదు. సర్వే విషయంలో మండలంతోపాటు, అర్బన్ మండలం, మున్సిపాల్టీలకు ఆ అధికారే ఉండటంతో కొంత సమస్యలు వచ్చి ఉండవచ్చు. అన్నింటిని సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటాం.

- మోహన్‌కుమార్, తహసీల్దార్, అనంతపురం రూరల్ మండలం

కళాశాల..!

కణేకల్లు వెనుకబడిన ప్రాంతం. పేదలు, కూలీలు అధికంగా నివాసం ఉంటున్నారు. పిల్లలను ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివించే స్థోమత చాలామందికి లేదు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారు. కణేకల్లులో జూనియర్ కళాశాల ఉండడంతో పంపుతున్నారు. ఆ పైచదువులకు మాత్రం ఇబ్బంది పడుతున్నారు. డిగ్రీ చదవాలంటే రాయదుర్గమో, ఉరవకొండో వెళ్లాల్సి వస్తోంది. రోజూ పిల్లలను కళాశాలకు పంపడం తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారుతోంది. దీంతో చదువు మధ్యలోనే మాన్పించేస్తున్నారు. విద్యార్థినుల పరిస్థితి చెప్పక్కర్లేదు. చాలామంది ఇంటర్మీడియట్‌తోనే చదువుకు స్వస్తి పలుకుతున్నారు. స్థానికంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే.. తాము చదువుకోగలమని విద్యార్థులు ఏళ్లుగా కోరుతున్నారు. డిగ్రీ కళాశాల వారి దశాబ్దాల కల. అందుకోసం ఈ ప్రాంతవాసులు ఉద్యమాలు కూడా చేపట్టారు. దశాబ్దాల కల సాకారం కాబోతోంది. కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానన్న ఎన్నికల హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేరుస్తున్నారు. ఆ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే కళాశాల నిర్మాణానికి ఉన్నతాధికారులు స్థలాన్ని పరిశీలించారు. తాత్కాలిక భవనాల్లో వచ్చే విద్యా సంవత్సరమే డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తుండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు.

- ఆంధ్రజ్యోతి, కణేకల్లు

43 ఏళ్ల కల..

కణేకల్లులో 1982లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. ఇక్కడ చదివిన విద్యార్థులు పైచదువులకు రాయదుర్గం, అనంతపురం, బళ్లారి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. దూర ప్రాంతాలకు వెళ్లి డిగ్రీ చదివే స్థోమత లేక చాలామంది విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపేసేవారు. దీంతో 43 ఏళ్లుగా డిగ్రీ కళాశాల కోసం ఇక్కడి విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం (ఫైల్)



హామీ ఇచ్చారు.. నెరవేరుస్తున్నారు..

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా కణేకల్లుకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు స్థానికులు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇచ్చారు. అందుకు ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటవడం, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు.

700 మంది విద్యార్థులకు ఉపయోగం

కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు దాదాపు 700 మంది విద్యార్థులకు ఉపయోగకరం. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలో చదివే విద్యార్థులకు ప్రయోజనకరం. ఇప్పటికే కణేకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం 250 మంది, బొమ్మనహాళ్‌లో 230 మంది, కణేకల్లు మోడల్ స్కూల్‌లో 38 మంది, కేజీబీవీలో 30 మంది చదువుతున్నారు. వీరిలో చాలామంది గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉండడంతో వీరంతా కణేకల్లులో డిగ్రీ కాలేజీ నిర్మిస్తే అందులో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు.

బాలికల్లో ఉత్సాహం

కణేకల్లులో వచ్చే విద్యా సంవత్సరం డిగ్రీ కళాశాల ప్రారంభం అవుతుందని తెలియడంతో బాలికల్లో ఉత్తేజం నెలకొంది. కణేకల్లులో ఇంటర్ పూర్తి చేసుకున్న తర్వాత అనేకమంది గ్రామీణ విద్యార్థినులు డిగ్రీ చదవాలంటే రాయదుర్గం, ఉరవకొండకు వెళ్లాల్సి వచ్చేది. ఆయా గ్రామాల నుంచి విద్యార్థినులు కణేకల్లుకు చేరుకుని, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలి. దీంతో చాలా మంది విద్యార్థినులు చదువును మధ్యలోనే మానేయాల్సి వచ్చింది. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా రోజూ తమ పిల్లలను 60 కి.మీ. దూరం పంపాల్సి వస్తుండడంతో ఆసక్తి చూపేవారు కాదు. కణేకల్లులోనే డిగ్రీ కళాశాల ప్రారంభవుతున్న నేపథ్యంలో బాలికల్లో డిగ్రీపై ఆశలు పెరిగాయి.

విద్యాభివృద్ధికి పెద్దపీట

వెనుకబడిన ప్రాంతమైన రాయదుర్గం నియోజకవర్గంలో విద్యతోనే అభివృద్ధి సాధ్యం. కావున నియోజకవర్గ వ్యాప్తంగా విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. అందులో భాగంలో కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నాం. అది నేటికి సాకారం అయింది. వచ్చే ఏడాది నుంచే విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. డిగ్రీ కళాశాల మంజూరు కావడంతో చాలా సంతోషంగా ఉంది.

-కాలవ శ్రీనివాసులు, ప్రభుత్వ విప్





ఉన్నత చదువులకు అవకాశం

నేను రోజూ స్వగ్రామం బ్రహ్మసముద్రం నుంచి కణేకల్లుకు 10 కి.మీ. దూరం వచ్చి ఇంటర్ చదువుతున్నా. డిగ్రీ చదవాలంటే రాయదుర్గం, ఉరవకొండకు వెళ్లాలి. రోజూ స్వగ్రామం నుంచి కణేకల్లుకు వచ్చి, ఇక్కడి నుంచి మరలా ఆ ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందే. డిగ్రీ అసాధ్యమనుకున్నా. కణేకల్లులోనే డిగ్రీ కళాశాల ఏర్పాటు కానుండడంతో ఉన్నత చదువులపై ఆశలు రేగాయి.

-వహీదా, ఇంటర్ విద్యార్థిని, బ్రహ్మసముద్రం

మంచి అవకాశం



కణేకల్లులో అనేక మంది పేద, మధ్యతరగతి బాలికలు చదువుకుంటున్నారు. ఇంటర్ పూర్తికాగానే చదువులు సందిగ్ధంలో పడేవి. ప్రస్తుతం డిగ్రీ కళాశాల ఏర్పాటవుతుండడం బాలికలకు మంచి అవకాశంగా భావిస్తున్నాం.

-వర్షిత, ఇంటర్ విద్యార్థిని, బెణెకల్లు



శుభ సూచకం..

కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు కానుండడం శుభ సూచకం. మా కాలేజీలో దాదాపు 552 మంది ఇంటర్ చదువుతున్నారు. డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఏటా పలువురు విద్యార్థులు ఇంటర్ పూర్తి కాగానే చదువు మానేస్తున్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుతో ఇంటర్ విద్యార్థులంతా చేరే అవకాశం ఉంది. ఉన్నత చదువులతో వారికి మంచి భవిష్యత్తు ఉంటుంది.

- ఆంజనేయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, కణేకల్లు

యథేచ్ఛగా జలచౌర్యం

- పట్టించుకోని అధికారులు
- అడుగంటుతున్న బీటీపీ
- ఆందోళనలో చివరి ఆయకట్టు రైతులు



బీటీపీ కాలువ నుంచి పైపుల ద్వారా జలచౌర్యం

గుమ్మఘట్ట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సాగునీటి సరఫరాపై అధికారుల నిఘా, నియంత్రణ లేకపోవడంతో ముందు భాగంలో ఉన్న కొందరు రైతులు అనధికారికంగా వాడుకుంటూ జలచౌర్యానికి పాల్పడుతున్నారు. దీంతో చివరి ఆయకట్టు రైతులు పంటలకు నీరందక ఎండిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. గుమ్మఘట్ట మండలంలోని భైరవాన్‌తిప్ప ప్రాజెక్టు (బీటీపీ)కు గత ఏడాది వర్షాలకు పూర్తిగా వర్షపునీరు చేరింది. దీంతో కుడి, ఎడమ కాలువల కింద 4,800 ఎకరాలకు సాగునీటిని అందించారు. ఆయకట్టులో వరి, వేరుశనగ పంటలు సాగు చేశారు. ఎడమ కాలువ కింద 14వ డిస్ట్రిబ్యూటరీ నుంచి చివరి ఆయకట్టు దాకా 3,800 ఎకరాలు, కుడి కాలువ కింద చివరి ఆయకట్టుకు రెండు వేల ఎకరాల దాకా సాగునీరు విడుదల చేయడంతో పంటలు సాగుచేశారు. ముందు భాగంలో రైతులు సాగునీటిని అనధికారికంగా వాడుకుంటుండడంతో చివరి ఆయకట్టులో అధికారికంగా సాగుచేసిన రైతులకు సాగు ప్రశ్నార్థకమవుతోంది. రోజురోజుకు వేసవి ఎండలతో రిజర్వాయర్‌లో నీరు అడుగంటి పోతోంది. గతంలో ఇరిగేషన్ అధికారులు డిస్ట్రిబ్యూటరీల ద్వారా ఆయకట్టుకు కావాల్సినంత నీటిని మాత్రమే విడుదల చేస్తూ ఎప్పటికపుడు పర్యవేక్షించేవారు. మూడునెలలుగా వారి పర్యవేక్షణ కొరవడింది. దీంతో కొంతమంది రైతులు ఎడమ కాలువలో అక్రమంగా పైపులు వేసి 30 దాకా మోటార్ల ద్వారా కాలువ నీటిని జలచౌర్యం చేస్తున్నారు. నియంత్రించాల్సిన ఇరిగేషన్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని చివరి ఆయకట్టు రైతులు వాపోతున్నారు. దీనికి తోడు కొంతమంది ఇష్టారాజ్యంగా సాగునీటిని వృథాగా హగరికి వదులుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అసలు ఆయకట్టు పంట సాగుచేస్తున్న రైతుల పంటలకు సాగునీరు సరిపడుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా ఆయకట్టు రైతులకు నాలుగునెలలు సాగునీరు అందించాలి. నీరు చేరడంలో ఆలస్యం కావడంతో పంటల సాగు జాప్యమవుతోంది. మరో రెండు నెలలు సాగునీరు ఇస్తే తప్ప పంట చేతికందడం కష్టం. వేసవి ఎండలతో అడుగంటడంతో ఉన్న నీటిని రైతులకు అందించడం కష్టతరంగా మారుతున్నట్లు సాగునీటి సంఘం సభ్యులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు నీటిని పొదుపుగా వాడుకోకపోతే ఇబ్బందులు తప్పవంటున్నారు. కొంతమంది రైతులు జలచౌర్యానికి పాల్పడుతూ అనధికారికంగా దాదాపు 200 ఎకరాలలో వరిపంట సాగుచేశారు. బీటీపీ నుంచి గుమ్మఘట్ట కేవీ ట్యాంక్ వరకు సాగునీటిని అక్రమంగా వాడుకుంటున్నా పట్టించుకునే వారు లేరు.



గుమ్మఘట్ట వద్ద అనధికారికంగా సాగుచేసిన వరిపంట

జలచౌర్యాన్ని అరికట్టాలి



గ్రామాల ప్రజలు, ప్రధాన కాలువలో కొంతమంది రైతులు పైపుల ద్వారా జలచౌర్యం చేస్తున్నారు. అధికారులు అరికట్టి ఆయకట్టు రైతులను కాపాడాలి. గతంలో ఇరిగేషన్ అధికారులు కాలువగట్లపై తిరుగుతూ నీటిని పొదుపుగా అందించేవారు. ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సాగునీరు ఇష్టారాజ్యంగా అక్రమ వాడకం జరుగుతోంది.

-గంగప్ప, ఆయకట్టు రైతు, కలుగోడు

చెరువుకు నీరు వదలండి



కలుగోడు ఎడమ కాలువ పరిధిలోని కలుగోడుచెరువు నీరులేక అడుగంటి పోయింది. ఈ చెరువు పరిధిలో మూడు గ్రామాలు తాగునీటి పథకాల బోరుబావులు అడుగంటి పోతున్నాయి. వేసవిలో తాగునీటి కోసం చెరువును బీటీపీ నీటితో నింపాలి. గతంలో పాలకులు చెరువును నీటితో నింపుతామని హామీ ఇచ్చి విస్మరించారు.

- రామాంజనేయులు, సీపీఐ నాయకుడు



ఆయకట్టును కాపాడుతాం



బీటీపీ కింద సాగు చేసుకున్న పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందిస్తాం. గతంలో లస్కర్లు ఉండడంతో సాగునీరు వృథా కాకుండా కాపాడేవాళ్లం. ప్రస్తుతం పై భాగంలో కొంతమంది రాత్రివేళల్లో జలచౌర్యం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆయా గ్రామాల్లో వారిని హెచ్చరించాం. ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షణ లోపంతో కొంతనీరు వృథాగా పోతున్న మాట వాస్తవమే. ఆయకట్టుకు పంటలు నష్టపోకుండా కాపాడుతాం.

- కాలవ నాగరాజు, బీటీపీ సాగునీటి సంఘం చైర్మన్

అధికారి తీరుతో హడల్..!

- సార్‌కు కోపం వస్తే టీ కప్పులు, సాసర్లు పగలాల్సిందే...
- ప్రజాసమస్యలపై కొర్రీలు... భయపడిపోతున్న సిబ్బంది
- కళ్యాణదుర్గంలోని ఓ అధికారి తీరుపై సర్వత్రా విమర్శలు



కళ్యాణదుర్గం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకమైన ఆ అధికారి తీరుతో అటు సిబ్బంది, ఇటు జనం హడలెత్తిపోతున్నారు. ప్రతి పనికీ కొర్రీలు వేస్తూ.. తిప్పుకుంటుండడంతో జనం బేజారవుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఆ అధికారి తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ సార్‌కు కోపం వస్తే టీ కప్పులు, సాసర్లు పగిలిపోవాల్సిందేనని.. ఆయన తీరుపై కిందిస్థాయి సిబ్బంది హడలెత్తిపోతున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక సిబ్బంది నలిగిపోతున్నారు. దీంతో కీలకమైన ఆ శాఖలో పాలన అస్తవ్యస్తంగా మారింది. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ ప్రస్తుత ప్రభుత్వంలో పరిష్కారమవుతాయని జనం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ, ఆ అధికారి ప్రతి సమస్యకు ఏదో ఒక సాకు చెబుతూ పనులు చేయకుండా వాయిదాలు వేస్తున్నారు. ఆయన నిర్వాకం వల్ల ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు. ప్రజాప్రతినిధులు కూడా ఆ అధికారి తీరుపై మండిపడుతున్నారు. ఆ అధికారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఒక్క పనీ ముందుకు సాగలేదు. గత కొన్ని నెలల నుంచి ఇదే పరిస్థితి. సిబ్బంది కూడా ఆ అధికారికి ఈ పని ఉంది పూర్తి చేయాలని చెప్పడానికి భయపడుతున్నారు. సిబ్బందిపై నిత్యం చిందులు వేస్తుండడంతో వారు భయపడిపోతున్నారు. ఆ అధికారిని పలకరించే సాహసం కూడా చేయలేకపోతున్నారు. కొంతమంది సిబ్బంది మౌనంగా తమ విధులు నిర్వహించుకుంటూ వెళ్లిపోతున్నారు. ఆ అధికారి ఇష్టానుసారంగా మాట్లాడుతుండడంతో కిందిస్థాయి సిబ్బంది నెలనెలా జీతం తీసుకున్నామా...విధులు నిర్వహించామా...వెళ్లామా అన్న రీతిలోనే కొనసాగుతున్నారు. దీంతో ఆ శాఖ వ్యవస్థ మూలనపడిపోయింది. సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ శాఖ పరిధిలో పనులన్నీ సాఫీగా సాగిపోయేవి. కానీ ప్రస్తుతం ముఖ్యమైన అధికారి తీరుతో పనులన్నీ పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. ఆ అధికారి తీరుతో ఆ శాఖ పరిధిలో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఐదేళ్ల నుంచి వేచి చూసినప్పటికీ ఏ మాత్రం ప్రయోజనం లేదని.. ఇప్పుడు కూడా తమ పనులు కావడం లేదని అధికార పార్టీ నాయకులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల మౌనమెందుకో..?

కీలకమైన అధికారి తీరుపై ఆ శాఖ ఉన్నతాధికారులు కూడా మౌనం వహించడం విమర్శలకు దారితీస్తోంది. పరిస్థితిని సమీక్షించకుండా, గాడినపెట్టకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అన్న వాదనలు వినిపిస్తున్నాయి. పాలన ఎలా ఉంది, ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయా లేదా అన్న విషయాలను కూడా తెలుసుకోవడంలో ఉన్నతాధికారులు పూర్తిగా విఫలమవుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఇప్పుడంతా కంప్యూటర్ పాలన సాగుతోంది. ఆ శాఖ ప్రగతిని తెలుసుకునే వెసులుబాటు ఉంది. కానీ, ఉన్నతాధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

పీడియాట్రిక్ సర్జన్ వార్డు ప్రారంభం

అనంతపురం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో చిన్నపిల్లల శస్త్ర చికిత్స వార్డును జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు సోమవారం ప్రారంభించారు. ఇక నుంచి ప్రతి సోమ, బుధవారాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పీడియాట్రిక్ ఓపీ సేవలు ఉంటాయని తెలిపారు. చిన్నారులకు ఇక్కడే సర్జరీలు చేస్తామని తెలిపారు.

ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యాజమాన్య కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా భక్తవత్సలం, కార్యదర్శిగా శివశంకర్

అనంతపురం సెంట్రల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో, ఎస్కేయూ అనుబంధ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నలంద డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా భక్తవత్సలం, ఉపాధ్యక్షుడిగా కేబీ చౌదరి, కార్యదర్శిగా శివశంకర్, సంయుక్త కార్యదర్శిగా వేణుగోపాల్, కోశాధికారిగా సత్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సుబ్బారావు, వనజ, బసయ్య, రామును ఎన్నుకున్నారు. డిగ్రీ ప్రవేశాల ప్రక్రియను సకాలంలో నిర్వహించకపోవడంతో గతంలో అడ్మిషన్ల శాతం పూర్తిగా పడిపోయిందని నూతన అధ్యక్ష, కార్యదర్శులు అన్నారు. కళాశాలల ఫీజులు తగ్గింపు, తల్లుల ఖాతాలకే ఫీజు రీయింబర్స్‌మెంట్, ల్యాబ్‌ల నిర్వహణ, ఆలస్యంగా ఫలితాలు విడుదల, క్రీడల నిర్వహణ ఇలా అనేక అంశాలతో కళాశాలలు మూసివేతదశకు చేరువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే విద్యాసంవత్సరంలో సకాలంలో ప్రవేశాలు కల్పించేలా ప్రభుత్వం చొరవచూపుతోందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కళాశాలలకే చెల్లించి, విద్యార్థులకు సమస్యల్లేకుండా చర్యలు తీసుకోవడం శుభపరిణామమని అన్నారు.



నూతన కార్యవర్గం

అలా.. బిల్లులు.. ఇలా.. చెల్లింపులు..

చంద్రబాబు పాలనలో ఎప్పటికప్పుడు డైట్ బిల్లుల విడుదల.. ప్రతినెలా వేతనాలు...

వార్డెన్లు, అధికారుల హర్షం



భోజనం కోసం లైన్లో ఉన్న విద్యార్థులు (ఫైల్)

కొత్త ప్రభుత్వం వచ్చాక డైట్ బిల్లులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తుండడంతో సంక్షేమ వసతిగృహాల వార్డెన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు కూడా పెండింగ్ లేకుండా క్లియర్ ఇచ్చేస్తున్నారు. గత వైసీపీ పాలనలో వార్డెన్లు పడరాని పాట్లు పడ్డారు. సకాలంలో డైట్ బిల్లులు అందక, జీతాలు పడక ఆర్థిక కష్టాలు భరించారు. వడ్డీలకు అప్పులు తెచ్చి ఓ వైపు కుటుంబాన్ని... మరోవైపు వసతిగృహాల విద్యార్థులకు డైట్ అమలు చేసేందుకు నానా అవస్థలు పడ్డారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వార్డెన్లకు నెలనెలా జీతాలు సమయానికి చెల్లించడంతోపాటు... డైట్ బిల్లులను సకాలంలో విడుదల చేస్తోంది. అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే జనవరి నెల నుంచి పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల పెండింగ్ బిల్లులను విడుదల చేసింది. డిసెంబరు నెల వరకూ బిల్లులను క్లియర్ చేసింది. దీంతో సంక్షేమశాఖల అధికారులతోపాటు... వార్డెన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్



టోటల్ క్లియర్..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీసీ, ఎస్సీ, గిరిజన సంక్షేమ హాస్టళ్లలో వేల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. తొలుత ఆయా వసతిగృహాలకు ఆగస్టు నుంచి బిల్లులు పెండింగ్‌లో పడిపోయాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.13 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించిన బిల్లులను మంజూరు చేసింది. ఆ తర్వాత అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలకు సంబంధించిన డైట్ బిల్లులను విడుదల చేసింది. దీంతో సంక్షేమ వసతిగృహాల వార్డెన్లు ఆనందంలో మునిగి తేలుతున్నారు. గత వైసీపీ హయాంలో ఆరేడు నెలల డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉండేవనీ, విద్యార్థులకు డైట్ అమలు చేసేందుకు అప్పులు చేసేవాళ్లమని వాపోతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పట్నుంచి రెండు నెలలకు మించి బిల్లులు పెండింగ్‌లో ఉంచడం లేదని చెబుతున్నారు. ఒకవేళ పెండింగ్ పెట్టినా.. అన్నీ ఒకేసారి క్లియర్ చేస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్ ఉంది... త్వరలోనే క్లియర్ అవుతాయి



గతేడాది డిసెంబరు పోస్ట్‌మెట్రిక్, ప్రీమెట్రిక్ వసతిగృహాలకు సంబంధించిన డైట్ బిల్లులు క్లియర్ చేశాం. ప్రస్తుతం జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి బిల్లుల ప్రతిపాదనలు పంపాం. బడ్జెట్ కూడా ఉంది. ట్రెజరీలోకూడా బిల్లులు పాసయ్యాయి. త్వరలోనే బిల్లులు పడుతాయి.

-రాధిక, డీడీ, ఎస్సీ సంక్షేమశాఖ

ప్రతిపాదనలు పంపాం...

జిల్లాలోని ప్రీమెట్రిక్ వసతగృహాలకు గతేడాది డిసెంబరు వరకూ బిల్లులు క్లియర్ అయ్యాయి. పోస్ట్‌మెట్రిక్ సంబంధించి సెప్టెంబరు వరకూ విడుదలయ్యాయ్యాయి. పెండింగ్ బిల్లులకు సంబంధించిన ప్రతిపాదనలు అడిగారు. ఇప్పటికే ఆ ప్రతిపాదనలు పంపాం. వారంలోపు నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

-కుష్బూకొఠారీ, డీడీ, బీసీ సంక్షేమశాఖ



మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న నారసింహుడు

సమ్మోహన రూపం

- మోహినీ రూపంలో దర్శనమిచ్చిన ఖాద్రీశుడు
- శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కదిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మైమరపించే సోయగాలతో, చంకన అమృతభాండాగారంతో మోహన రూపుడైన శ్రీవారిని దర్శించుకోవడానికి వేలాది భక్తులు తరలిరాగా ఆలయ ప్రాంగణంతో పాటు తిరువీధులు సందడిగా మారాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నారసింహుడు మోహినీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం యాగశాలలో నిత్యపూజ, హోమం అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సంధ్యా సమయంలో మోహినీ అలంకారాన్ని గావించారు. బ్రహ్మోత్సవాల్లో అన్ని రోజుల్లోనూ శ్రీవారు తిరువీధుల్లో మాత్రమే విహరిస్తారు. అయితే మోహినీ ఉత్సవం రోజు కోరిన భక్తుడి ఇంటికి వెళ్లి దర్శనమిచ్చారు. సోమవారం రాత్రి ఆలయం నుంచి బయలుదేరిన శ్రీవారు తిరిగి ఆలయ ప్రవేశం గావించేది మంగళవారం మధ్యాహ్నానికే. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రజా గరుడ సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీలక్ష్మీనారసింహుడు మంగళవారం ప్రజా గరుడ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం నిత్యపూజ , హోమం అనంతరం గ్రామ సేవ నిర్వహిస్తారు. సంధ్యాసమయంలో శ్రీవారు గరుడ వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఉత్సవానికి ఓ ప్రత్యేకత ఉంది. అదేమంటే బ్రహ్మోత్సవాల ప్రారంభంలోనే ఓమారు గరుడ సేవను నిర్వహించినా మళ్లీ ప్రజల కోరిక మేరకు గరుడ సేవను నిర్వహిస్తారు. అందుకే దీన్ని ప్రజా గరుడ సేవ అని పిలుస్తారు.



హాజరైన భక్తులు

బ్రహ్మోత్సవాల్లో కొక్కంటి పాలేగాళ్ల జ్యోతి

తనకల్లు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో కొక్కంటి పాలెగాళ్ల జ్యోతికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఉత్సవాల్లో భాగంగా కదిరి పున్నమి నుంచి తీర్థవాది వరకు రోజూ తిరువీధుల్లో నిర్వహించే స్వామి వారి ఊరేగింపును ఈ జ్యోతి ముందుండి నడిపిస్తుంది. పది రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి అయ్యే ఖర్చును మొత్తం కొక్కంటి పాలేగాళ్లు వైవి. దినకర్‌ప్రసాద్ నాయుడు భరిస్తున్నారు. తరతరాలుగా తమ వంశస్థులకు ఈ గౌరవం దక్కడం తమ అదృష్టమని ఆయన తెలిపారు.



బ్రహ్మోత్సవాల్లో ముందున్న కొక్కంటి జ్యోతి

నేడు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రాక

అనంతపురం కల్చరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మంగళవారం జిల్లాకు వస్తున్నారు. ప్రజాసమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్య యాత్రల్లో భాగంగా ఆయన అనంతపురం రానున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నల్లప్ప సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం తాడిపత్రి ప్రాంతంలో సోలార్ ఎనర్జీ కేంద్రాలను సందర్శిస్తారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు అనంతపురంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడతారని వివరించారు.

తాగునీటికి రూ.115 కోట్లు

- తీరనున్న పుట్టపర్తి ప్రజల దాహార్తి

పుట్టపర్తి టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మున్సిపాలిటీ సమగ్ర తాగునీటి పథకానికి రూ.115 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం సాయంత్రం జీఓ నంబరు 199 విడుదల అయింది. ఈ నిధులతో మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. ప్రభుత్వం నిధులను విడుదల చేయడం పట్ల ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పురపాలక శాఖ మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

రాలుతున్న ఆశలు..!

మామిడి రైతుకు దిగుబడి దిగులు

- చెట్లలో రాలిపోతున్న పూత
- పిందెలు నేలపాలు
- కనిపించని ఉద్యాన శాఖాధికారులు



కల్లుదేవనహళ్లి వద్ద సాగు చేసిన మామిడి తోట

బొమ్మనహాళ్, మార్చి17(ఆంధ్రజ్యోతి): మామిడి రైతుకు దిగుబడి దిగులు పట్టుకుంది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక మామిడి చెట్లలో పూత నెలరోజులు ఆలస్యంగా వచ్చింది. పూత బాగా రావడంతో దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు సంబరపడ్డారు. ఉన్నఫలంగా పూత మొత్తం రాలిపోతోంది. పిందెలు కూడా నిలవట్లేదు. ఆశల పంట కళ్లెదుటే నేల రాలుతుంటే రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పూతను నిలబెట్టుకునే మార్గం తెలియక దిక్కులు చూస్తున్నారు. పెట్టుబడి కూడా దక్కదనీ, తీవ్ర నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు సలహాలివ్వాల్సిన ఉద్యానవన శాఖాధికారులు పొలాల వద్దకు కూడా రావట్లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఫర్టిలైజర్స్ దుకాణ దారులిచ్చే మందులు పిచికారీ చేస్తూ.. రైతులు మరింత నష్టపోతున్నారు.

ఎకరాకి రూ.50 వేలు పెట్టుబడి

మండలంలోని కల్లుదేవనహళ్లి, బండూరు, ఉంతకల్లు, కొళగానహళ్లి తదితర గ్రామాల్లో మామిడి సాగు చేశారు. ఏటా పంట సాగు చేసే రైతులు పెరుగుతున్నారు. కూలీలు, మందులు తదితర వాటికి సుమారుగా రైతులు ఎకరాకు రూ.50 వేలు ఖర్చు చేసుకున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు ఏమాత్రం అనుకూలించట్లేదు. సాధారణంగా డిసెంబరులో రావాల్సిన పూత నెలరోజులు ఆలస్యంగా వచ్చింది. అయినా.. పూత నిండుగా రావడంతో రైతులు సంబరపడ్డారు. దిగుబడి ఆశాజనకంగా వస్తుందని ఆశించారు. తర్వాత పూత రాలడం మొదలెట్టింది. వచ్చిన పూత వచ్చినట్లుగానే రాలిపోతోంది. పిందెలు కూడా నేల రాలుతున్నాయి. చెట్లలో కాడలు మాత్రం కనిపిస్తున్నాయి. కళ్ల ముందే పూత, పిందెలు రాలిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని తోటలకు ఎరువులు వేసినా.. పెద్దగా ఫలితంలేదని రైతులు తెలిపారు. నష్టాలు తప్పవని వారు ఆవేదన చెందుతున్నారు. పూత, పిందెలను కాపాడుకునేందుకు రైతులు పలురకాల మందులు పిచికారీ చేస్తున్నారు. అయినా ప్రయోజనం దక్కట్లేదు. పెట్టుబడి మరింత పెరుగుతోంది. ఉద్యాన శాఖాధికారులు.. తోటల వైపు కూడా చూడట్లేదని రైతులు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యాన శాఖాధికారులు రాయదుర్గంలో ఉంటున్నారు. దీంతో తోటలను సందర్శించి, రైతులకు సరైన సమయంలో సలహాలు ఇచ్చేవారు కరవయ్యారు.



రాలి పోయిన పిందెలు

తోటలోకి వెళ్తే బాధేస్తోంది

మామిడి పూత, పిందెలు రాలుతున్నాయి. మందులు పిచికారీ చేస్తున్నా పూత నిలవడం లేదు. పిందెలు రాలడం చూసి తోటలోకి వెళితే బాధవుతోంది.

- ఖలంధర్, రైతు, గోవిందవాడ

అవగాహన కల్పించాలి

మామిడి సాగును ప్రభుత్వాలు పోత్సహిస్తున్నాయి. పంట సాగుపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. క్షేత్రస్థాయిలో తోటలను పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించేవారు కరువయ్యారు.

- సికిందర్, రైతు, ఉంతకల్లు

పిల్ల పురుగులు ఆశించడంతోనే..

మామిడి చెట్లకు పిల్ల పురుగులు ఆశించడంతోనే పూత, పిందెలు రాలుతున్నాయి. చిగుర్లు ఏర్పడే సమయంలో పిల్ల పురుగులు ఆకులపై చేరి గోకి రసాన్ని పీల్చుతాయి. తద్వారా పూత, చిగుర్లు, ఆకులు చిన్నవిగా మారి రాలిపోతాయి. పిందె ఏర్పడే సమయంలో తోలుపై గోకి రసాన్ని పీలుస్తాయి. కావున పిందెలు కూడా రాలుతాయి. పురుగుల ఆశించిన కాయలపై మంగు ఏర్పడి, నాణ్యత దెబ్బతింటుంది. కాయలకు రక్షణ కవచం ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఈ పురుగు నుంచి రక్షణ కల్పించవచ్చు. పురుగుల ఉధృతి మరీ ఎక్కువగా ఉంటే అసిఫేట్ 75 గ్రాములు.. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. పురుగు తగ్గకపోతే 15.. 20 రోజుల తర్వాత ఫిప్రోనెల్ 5 ఎస్.సి. 2 ఎం.ఎల్.. లీటరు నీటిలో కలిపిగానీ, స్పైనసైడ్ 45 ఎస్.పి. 0.3 ఎం.ఎల్. లీటరు నీటిలో కలిపిగానీ పిచికారీ చేసుకోవాలి.

- మౌనిక, ఉద్యాన శాఖాధికారి, రాయదుర్గం

వామ్మో.. మూటలు..!

- యర్రంపల్లి వద్ద కలకలం
- రైల్వేట్రాక్ పక్కన వెలుగులోకి..
- ఉరుకులు, పరుగులు పెట్టిన పోలీసులు
- మేకల కళేబరాలు బయటపడడంతో ఊపిరి పీల్చుకున్న వైనం



పరిశీలిస్తున్న రామగిరి సీఐ శ్రీధర్, సిబ్బంది

చెన్నేకొత్తపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రంపల్లి వద్ద సోమవారం దుర్వాసన వెదజల్లుతూ రైల్వేట్రాక్ పక్కన, వంతెన కింద పడి ఉన్న మూటలు కలకలం రేపాయి. రైల్వే, స్థానిక పోలీసులను ఉరుకులు, పరుగులు పెట్టించింది. ఎర్రంపల్లి సమీపంలోని రైల్వేట్రాక్ పక్కన మూడుచోట్ల వేర్వేరుగా ప్లాస్టిక్ సంచి మూటలు పడి ఉన్నాయి.ఒక్కో మూట మధ్య అర కిలోమీటరు మేర దూరం ఉంది. రైతులు.. తోటల వద్దకు వెళ్తుండగా దుర్వాసన వచ్చింది. దగ్గరికి వెళ్లి చూడగా ప్లాస్టిక్ సంచితో కూడిన మూటలు పడి ఉన్నాయి. రైల్వే వంతెన కింద ఒకటి, మిగిలిన రెండు మూటలు దూరదూరంగా ట్రాక్ పక్కన గుంతలో పడేశారు. అనుమానం వచ్చి రైల్వే, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. విషయాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ధర్మవరం రైల్వే సీఐ అశోక్‌కుమార్, రామగిరి సీఐ శ్రీధర్ అక్కడికి చేరుకుని, మూటలను పరిశీలించారు. అనంతరం ఒక్కొక్కటిగా మూటలను తెరిపించగా కుళ్లిపోయి పురుగులు పట్టిన మేకలు, వాటి పిల్లల కళేబరాలు బయటపడ్డాయి. దీంతో పోలీసులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. వ్యాధులు సోకి మృతిచెందిన వాటిని గుర్తుతెలియని కాపరులు సంచుల్లో మూట కట్టి ఇక్కడ పడేసి ఉంటారని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

శిక్షణతో ఉద్యోగావకాశాలు మెరుగు

- జేఎన్టీయూ ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి

అనంతపురం సెంట్రల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): శిక్షణతో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరుగు పడతాయని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి పేర్కొన్నారు. యూనివర్సిటీలో ఆప్టిట్యూడ్, రీజనింగ్‌పై విద్యార్థులకు శిక్షణ సోమవారం ముగిసింది. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి.. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసి, మాట్లాడారు. కళాశాల నుంచే ఉద్యోగాలు సాధించేలా ఎంటెక్, ఎంసీఏ విద్యార్థులకు ప్రథమ సంవత్సరంలోనే ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోజువారీ పాఠ్యాంశ బోధనతోపాటు సెలవు రోజుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపు హ్యాండ్‌బాల్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 19వ తేదీన అనంతపురంలోని న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సాకే శివశంకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జూనియర్ బాలికలు, బాలుర విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. 2005 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల వారు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడా సామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు ఈనెల 20వ తేదీన విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 8978137522, 7013572439 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డ్వామాలో బదిలీల సందడి..!

- వేర్వేరుగా నిర్వహణ
- హెచ్ఆర్‌లో మాయ
- సిఫారసు కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ
- రేపు కౌన్సెలింగ్



అప్షన్ల నమోదుకు డ్వామా కార్యాలయంలో ఉద్యోగుల హడావుడి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): డ్వామాలో బదిలీల ప్రక్రియ మొదలయింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు చేపడుతున్నారు. మొదట ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీలు చేయాలని సూచించినా.. తరువాత అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు వేర్వేరుగా బదిలీలు చేపట్టాలని ప్రభు త్వం ఆదేశించింది. సోమవారం సాయంత్రం వరకు బదిలీల ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో మూడేళ్లు పూర్తయిన ఉద్యోగులు బదిలీలకు అర్హులు. ఇందులో ఏపీఓలు 11 మంది, టీఏలు 98 మంది, కంప్యూటర్ ఆపరేటర్లు 51 మంది బదిలీల ఆప్షన్లు పె ట్టుకున్నారు. కొంతమంది ఉద్యోగులకు మూడేళ్లు పూర్తయినా, ఎనిమిదేళ్లు ఒకే స్థానంలో పనిచేస్తున్నా.. బదిలీల జాబితాలో పేర్లులేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈనెల 20వ తేదీన ఆప్షన్లు ఇచ్చిన ఉద్యోగులకు బదిలీ కౌన్సెలింగ్, 22లోపు ఆయా బదిలీల స్థానాల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

160 మంది బదిలీకి ఆప్షన్లు

డ్వామాలో పనిచేస్తున్న ఉపాధి హామీ పథకం ఉద్యోగులు బదిలీ ఆప్షన్ల ప్రక్రియ ముగిసింది. మూడేళ్లు పూర్తయిన ఉద్యోగులు బదిలీలకు అర్హులు. ఇందులో ఏపీఓలు 11 మంది, టీఏలు 98 మంది, కంప్యూటర్ ఆపరేటర్లు 51 మంది బదిలీల ఆప్షన్లు పెట్టుకున్నారు. బదిలీల ఆప్షన్లలో ఈసీలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. వీరిలో గుత్తి ఏపీడీ అసిస్టెంట్ ఎనిమిదేళ్లు, బుక్కరాయసముద్రం ఏపీడీ అసిస్టెంట్ ఏడేళ్లు, హెచ్ఆర్ విభాగంలో ఓ కంప్యూటర్ ఆపరేటర్ ఎనిమిదేళ్లు, రాప్తాడు నియోజకవర్గంలోని ఓ మండలంలో పనిచేస్తున్న ఏపీఓ ఐదేళ్లు, కూడేరులో ఓ కంప్యూటర్ ఆపరేటర్ ఐదేళ్లు పూర్తి చేసుకున్నా బదిలీల జాబితాలో పేర్లు లేకపోవడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా హెచ్ఆర్ విభాగం ప్రభావమేనని తెలుస్తోంది. దీని వెనుక ముడుపులు ఉన్నట్లు చర్చించుకుంటున్నారు.

సిఫారసు లేఖల కోసం పాట్లు

డ్వామాలో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీలకు సిఫారసు లేఖల కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. మొదట ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తర్వాత విభజన జిల్లాల్లో కలెక్టర్, డ్వామా పీడీలే బదిలీలు చేపట్టాలని పేర్కొంది. దీంతో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు వేర్వేరుగా బదిలీలు ప్రారంభించాయి. బదిలీల కోసం ఆయా నియోజకవర్గాల్లో ఉన్న ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను జత చేసి ఆప్షన్లు ఇస్తున్నారు. ఉద్యోగుల బదిలీల ఫైల్ కలెక్టర్‌కు చేరింది. ఫైల్‌తో పాటు ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను చూసిన కలెక్టర్ ఆశ్చర్యపోయినట్లు సమాచారం. బదిలీ ఉద్యోగుల సంఖ్య కంటే సిఫారసు లేఖలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

పారదర్శకంగా బదిలీలు

జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపడుతున్నాం. మొదట ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీ చేపట్టాలని నిర్ణయించారు. తరువాత విభజన జిల్లాల వారీగా ఉద్యోగుల ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు బదిలీ ఆప్షన్లు తీసుకున్నాం. ఇందులో ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఈసీలు ఉన్నారు. మూడేళ్లు పూర్తయిన ఉద్యోగులు కచ్చితంగా బదిలీ కావాల్సిందే. ఇదే నిబంధనలతోనే బదిలీలు పూర్తి చేస్తాం.

- సలీంబాషా, పీడీ, డ్వామా

రైతు రథాలు ఇవ్వాలి

పథకం పునరుద్ధరణకు ప్రభుత్వ విప్ కాలవ విజ్ఞప్తి



అసెంబ్లీలో మాట్లాడుతున్న కాలవ

రాయదుర్గం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అన్నదాత అవసరాలకు అనుగుణంగా మండలానికి 50 రైతు రథాలు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు విన్నవించారు. అసెంబ్లీలో సోమవారం రైతు సమస్యలపై ఆయన మాట్లాడారు. టీడీపీ పాలనలో రైతు రథం పథకం ద్వారా సబ్సిడీపై ట్రాక్టర్లు పంపిణీ చేశామన్నారు. తిరిగి ఆ పథకాన్ని పునరుద్ధరించి, రానున్న ఏడాది నుంచి మండలానికి కనీసం 50 ట్రాక్టర్లు మంజూరు చేయాలని కోరారు. టీడీపీ హయాంలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చామన్నారు. రైతుల సౌకర్యార్థం 113 పథకాలు అమలు చేశామన్నారు. తరువాతి వైకాపా ప్రభుత్వం వాటిని పక్కనపెట్టి రైతాంగానికి తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. మైక్రో ఇరిగేషన్ కింద డ్రిప్, స్ప్రింక్లర్లపై కేంద్రం సబ్సిడీ రూపంలో ఇచ్చిన నిధులు కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. దీంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే రాయలసీమ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. పండ్ల తోటల సాగుపై ఎక్కువ ఆధారపడ్డ సీమ రైతులు సాగునీటి కొరత వల్ల డ్రిప్, స్ప్రింక్లర్ వ్యవసాయం చేస్తున్నారన్నారు. సీమ అనావృష్టి పరిస్థితులను గుర్తించి పదెకరాల మెట్ట కంటే ఎక్కువున్న రైతులకు కూడా నిబంధనలు సడలించి 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇవ్వాలని సంబంధిత మంత్రికి కాలవ విజ్ఞప్తి చేశారు.

ముగ్గురిపై పోక్సో కేసు నమోదు

ధర్మవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ముగ్గురిపై సోమవారం పోక్సో కేసు నమోదైంది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు, సిద్దు అనే యువకుడు, ఓ బాలిక ప్రేమించుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్ ఆధారంగా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సిద్దు ఇంటికి వెళ్లి మందలించారు. ఆ సమయంలో ఇంట్లో లేని సిద్దు, తరువాత మరో ఇద్దరితో కలిసి బాలిక ఇంటి వద్దకు వెళ్లి గొడవపడ్డాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిద్దుతోపాటు అతనికి సహకరించిన సాయి, వెంకటేశ్‌పై పోక్సో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

చేనేతకు ఉచిత విద్యుత్

- రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం

పుట్టపర్తి, మార్చి17(ఆంధ్రజ్యోతి): చేనేతలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలంలో సోమవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. జిల్లాలో వ్యవసాయం తరువాత అత్యధికంగా జీవనోపాధినిస్తున్న చేనేత రంగాన్ని ఆదుకోవాలని నిర్ణయించారు. చేనేత కార్మికుల గృహాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. దీంతో జిల్లాలో 33,274 మంది చేనేత కార్మికులు, పదివేలదాకా పవర్‌లూమ్స్ యూనిట్లకు లబ్ధిచేకూరనుంది. పరిశ్రమలు, వాణిజ్య ప్రాజెక్టులను వేగవతం చేసే దిశలో ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 కింద అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో 4000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుత్ ప్రాజెక్టులను (ఎంఎస్ ఏపీ ఎన్‌జీఈఎల్ హరిత్ అమృత్ లిమిటెడ్) ఏర్పాటు చేయడానికి చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

అవినీతి సొమ్ము కక్కిస్తాం

- కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి
- బయోమైనింగ్, కుక్కల ఆపరేషన్‌పై ఆగ్రహం
- ముందు విచారణ చేయించండి : మేయర్ వసీం
- పలు అంశాలపై రచ్చ
- రూ. 135 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం


మాట్లాడుతున్న మేయర్ వసీం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): 'ఎవరెవరిపై అవినీతి ఆరోపణలున్నాయో అన్నీ లెక్కిస్తాం. అవినీతి సొమ్ము కక్కిస్తాం' అని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. అనవసర ఆరోపణలు వద్దని, ముందు విచారణ చేయించాలని నగర మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. సోమవారం 2025-26 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ అంశంపై నిర్వహించిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం వాడి-వేడిగా సాగింది. నగర మేయర్ మహమ్మద్ వసీం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, అధికారులు హాజరయ్యారు. ముఖ్యంగా డంపింగ్‌యార్డ్, కుక్కల ఆపరేషన్‌కు చెందిన అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ)అంశాలపై టీడీపీ, వైసీపీ వర్గాలు వాగ్వాదాలతో రచ్చ లేపారు. అనుకున్నట్లుగానే బిల్లుల పైనే తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. కార్పొరేటర్లు పలు స్థానిక సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. ఒకానొక సందర్భంలో కార్పొరేటర్లు ఇష్టానుసారంగా మాట్లాడటంపై నగర కమిషనర్ బాలస్వామి అసహనం వ్యక్తం చేశారు. మొత్తం రూ.135కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సభ్యులడిగిన ప్రతి ప్రశ్నకు తాను లేదా సంబంధిత అధికారి ద్వారా కమిషనర్ సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశారు.

ఆ డబ్బెవరు కడతారు అబూ...?

సమావేశంలో 13వ డివిజన్ కార్పొరేటర్ అబూసాలెహ మాట్లాడుతూ... కమలానగర్ పరిధిలోని బాషా హోటల్ యజమాని బాషా మృతి చెందారని తెలిపారు. కానీ ట్రేడ్ లైసెన్స్ రూ.లక్షల్లో కట్టాలంటున్నా రని, చనిపోయిన వ్యక్తి ఆ డబ్బు ఎలా కడతారని ప్రశ్నించారు. ఆయన కోడలి పేరుతో కొత్త ట్రేడ్ లైసెన్స్ ఇవ్వాలని కోరారు. అలా కుదరదని ఎంహెచ్ఓ విష్ణుమూర్తి చెప్పగా... ఎందుకు కాదంటూ కార్పొరేటర్ దబాయించారు. కమిషనర్ జోక్యం చేసుకుని...ఆ విషయం పరిశీలిస్తామని చెప్పారు.

రగడ ఇలా మొదలు

కార్పొరేటర్ లాలు మాట్లాడుతూ... డంపింగ్‌యార్డు సమస్యపై సరైన సమాధానం చెప్పాలంటూ నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ డంపింగ్ యార్డ్‌కు సంబంధించి టెండరు పిలిచామని, అక్టోబరు 2లోగా శుభ్రం చేస్తామని తెలిపారు. త్వరలోనే కొత్త డంపింగ్‌యార్డును తీసుకొస్తామన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ... అప్పటి లోగా బయో మైనింగ్ చేయించడంగానీ, ప్రత్యామ్నాయమార్గం కానీ చూడాలన్నారు. అనంతరం లాలు మాట్లాడుతూ...నగరంలో కుక్కల బాధ లేకుండా చేయాలని నాలుగేళ్ల నుంచి కోరుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ...కుక్కల ఆపరేషన్‌కు సంబంధించి అనిమల్‌బర్త్ కంట్రోల్(ఏబీసీ) రూ. 48 లక్షల ప్రాజెక్టు పేరుతో చేపట్టిన పనిలో వర్క్ ఆర్డర్ లేకుండా బిల్లులు ఎలా చేశారని ప్రశ్నించారు. ఇందుకు కమిషనర్ మాట్లాడుతూ... ఆ రికార్డ్స్ పక్కాగా లేవని, కానీ కొంతవరకు నిధులిస్తేనే ఆ సంస్థ చేస్తానని చెప్పిందన్నారు. అందులో తాము పరిశీలిస్తే లోపాలున్నట్లు తేలిందన్నారు. ఇదే సమయంలోనే డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, సాహిత్య మాట్లాడుతూ... కుక్కల వర్క్‌కు సంబంధించి డబ్బారేకులకు అధికంగా ఎస్టిమేషన్ వేశారన్నారు. గతంలోనే రూ. 14 లక్షల చెక్కు ఇస్తుంటే నిలిపి వేశామని, మరోసారి ఎందుకివ్వాల్సి వచ్చిందని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరగాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ... వర్క్ ప్రాసెస్‌లో ఉండటంతో ఇవ్వాల్సి వచ్చిందన్నారు. పెండింగ్‌లో ఉన్న డబ్బు విడుదల చేస్తే మిగిలిన పని పూర్తి చేస్తామన్నారు. కౌన్సిల్‌లో తీర్మానం చేస్తే కొత్త ఏజెన్సీకి ఆ వర్క్ అప్పగిద్దామని తెలిపారు.

డంపింగ్‌యార్డ్‌పై రచ్చ

కొంతసేపటికే గుత్తి రోడ్డు డంపింగ్‌యార్డ్‌పై రచ్చ జరిగింది. గతంలో దొంగ బిల్లులతో దోచేశారని ఎమ్మెల్యే అన్నారు. ఇందుకు మేయర్ మాట్లాడుతూ...గతంలో కొంతవరకే ఇచ్చామని, ఆ తరువాత మీరే బిల్లు చేయమని చెప్పారని అన్నారు. ఇందుకు ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఎవరెవరిపై అవినీతి ఆరోపణలున్నాయో వెలికి తీసి, ఆ సొమ్మంతా కక్కిస్తామని అన్నారు. మేయర్ మాట్లాడుతూ...ప్రతి సారి అనవసర ఆరోపణలు తగదని, ముందు విచారణ చేయించాలన్నారు. ఈ తొమ్మిది నెలల్లో ఏం జరిగిందో తామూ వెలికితీస్తామన్నారు. డిప్యూటీ మేయర్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... 77రోజులు మిషనరీ పనిచేయకపోయినా రూ. 3లక్షలకు పైగా చెత్త బయోమైనింగ్ ఎలా జరిగిందన్నారు. ఇదే సమయంలో మేయర్... అప్పట్లో మాజీ ఎమ్మెల్యే సమక్షంలో అని అంటుండగా... మాజీ ఎమ్మెల్యే ప్రస్తావన ఎందుకని...మీకు తెలియకుండానే జరిగిందా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కార్పొరేటర్లు నరసింహులు, కమల్‌భూషణ్, అనిల్ మాట్లాడుతూ... ఎవరి హయాంలో ఎంత బిల్లు చేశారో తేల్చాలనగా... విచారణ జరుగుతుందని. ఎంత అవినీతి జరిగిందో ఆ లెక్క తేలుస్తామని ఎమ్మెల్యే అన్నారు. అలాగే రూ. 1500 తో షెడ్డు కట్టిస్తానని మీ డిప్యూటీ మేయర్ చెబుతున్నా రని, అదనంగా రూ. 3500 ఎందుకు ఎస్టిమేషన్ వేయించారని ప్రశ్నించారు.

టీడీపీ వర్సెస్ వైసీపీ

కార్పొరేటర్ నరసింహులు మాట్లాడుతూ..గత వైసీపీ హయాంలో అభివృద్ధి పనులు జరిగాయని, కానీ ఇప్పుడు పని చేయడానికి ఎవరూ రావడం లేదన్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇప్పుడు పనులు చేపడు తున్నామని గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా టీడీపీ కార్పొరేటర్లు బాలాంజనేయులు, బాబా ఫక్రుద్దీన్... వైసీపీ కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అనిల్‌కుమార్, నరసింహులు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ... సభ్యులు వాగ్వాదం చేసుకోకూడదని, ఏదైనా సభాధ్యక్షుల ద్వారా వెళ్లాలని సూచించారు.

బ్రిడ్జికి ఈ పేర్లు పెట్టండి

నగరంలోని టవర్‌క్లాక్ సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జికి అబ్దుల్‌కలాం పేరు పెట్టాలని కార్పొరేటర్లు బాబాఫక్రుద్దీన్, రహంతుల్లా, ఇషాక్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రీకృష్ణదేవరాయలు పేరు పెట్టాలని సాహిత్య ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. కులాలు, మతాలకు సంబంధించి కాకుండా గతంలో ఉన్న నీలం సంజీవరెడ్డి పేరే పెట్టాలని శేఖర్‌బాబు కోరారు. కాగా డీఈఓ కార్యాలయం పక్క నున్న టీ స్టాల్ గురించి నిర్ణయం తీసుకోవాలన్నారు. అక్కడ ఫుట్‌పాత్‌తో పాటు ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోందని, విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు.

పలు సమస్యల ప్రస్తావన

కార్పొరేటర్ రామాంజినమ్మ మాట్లాడుతూ... డివిజన్‌లో అనేక సమస్యలు నెలకొన్నాయని, వాటికి పరిష్కారం చూపడంలేదన్నారు. చిన్న చిన్న పనులు కూడా చేయించలేరా అని ప్రశ్నించారు. బ్లూ పైపులిచ్చినా...నీరు సరఫరా కావడం లేదని, తలెత్తుకొని తిరగలేకపోతున్నామన్నారు. మునిశేఖర్ మాట్లాడుతూ... గత కౌన్సిల్‌లో అడిగిన ఏవీ పరిష్కారం కాలేదన్నారు. ఇందిరా నగర్‌లో మెయిన్‌రోడ్డు వేయలేదన్నారు. ఎమ్మెల్యే సమాధాన మిస్తూ... కాంపౌండ్‌వాల్, రోడ్డు పనులు రెండూ పూర్తి చేయిస్తామన్నారు. నాగమణి మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డులో పొగ రావడం వలన స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరి కొందరు సభ్యులు మాట్లాడుతూ... ఇంటింట చెత్త సేకరణ జరగడం లేదన్నారు. డంపింగ్ యార్డ్‌లో ఎండాకాలం కావడంతో మంటలు, పొగ సమస్య ఉంటుందని, నీరు పెట్టించి పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు.


టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం


బైఠాయించిన కార్పొరేటర్ లాలు


కమిషనర్‌కు కార్పొరేటర్ల వినతి


ఎమ్మెల్యేకి డిప్యూటీ మేయర్ వినతి

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి పూజలు


లక్ష్మీగణపతి మందిరంలో హనుమద్ సమేత గణనాథుడు

అనంతపురం కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఫాల్గుణ బహుళ చవితిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాల్లో సంకష్ట చతుర్థి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నేపథ్యంలో మల్లేశ్వరరోడ్డులోని లక్ష్మీగణపతి మందిరం, మూడో రోడ్డు షిర్డీసాయి ఆలయం, మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం తదితర ఆలయాల్లో గణనాథుడి మూల విరాట్లకు విశేష పూజలు నిర్వహించారు. అలాగే భక్తులు సంకష్టహర వ్రతాలను ఆచరించారు. కార్యక్రమంలో ఆయా ఆలయాల కార్యవర్గాలు, భక్తులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఆత్మకూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో సోమవారం స్వామి వారి హుండీ లెక్కించారు. జిల్లా డివిజన్ పర్యవేక్షణాధికారి వన్నూర్ స్వామి సమక్షంలో లెక్కించారు. రూ. 22, 24, 832 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఆదాయాన్ని దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి బాబు, ప్రధాన అరకులు రాముస్వామి,సిబ్బంది, భ్రమరాంబిక సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

22 నుంచి చిరు ధాన్యాల పండుగ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి17(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం, రైతుల శ్రేయస్సును ఆకాంక్షిస్తూ ఈనెల 22వ తేదీ నుంచి చిరుధాన్యాల ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. స్థానిక ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మిల్లెట్స్ ఫెస్టివల్‌కు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. మల్లారెడ్డి మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో కలిసి అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి మూడు రోజులపాటు ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లో చిరుధాన్యాల పండుగ (మిల్లెట్ ఫెస్టివల్) నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భానుజా, తిరుమల నాయక్, కిష్టప్ప, రమేష్ సునర్ల, మురళీకృష్ణ, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ. 26వేలు

అనంతపురం రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 26,120 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.3,500, సరాసరి రూ. 15వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 874 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషిచేయాలి

- ఎస్కేయూ రిజిస్ట్రార్

అనంతపురం సెంట్రల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేసి వారి సంక్షేమానికి కృషిచేయాలని వర్సిటీ బోధనేతర ఉద్యోగుల సంఘం నాయకత్వానికి ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు సూచించారు. నూతనంగా ఎన్నికైన ఆ సంఘం అధ్యక్షుడు తిమ్మప్ప, ఉపాధ్యక్షుడు నాగముని, కార్యదర్శి సాకే మారుతీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వారిని అభినందించిన రిజిస్ట్రార్ రమేష్‌బాబు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

జనసేనపై షర్మిల మాటలు హాస్యాస్పదం

- జనసేన పార్టీ నాయకుడు భవానీ రవికుమార్



అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జనసేన వైఖరి విభజించు పాలించు అన్నట్లుగా ఉందని.. పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని జనసేన రాష్ట్ర కార్యనిర్వహణ ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్ అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గురించి మాట్లాడే నైతికత కాంగ్రెస్ పార్టీ నేతలకు లేదన్నారు. జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభలో సనాతన ధర్మం గురించి మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ ఎందుకు ఉలిక్కి పడుతోందో అందరికి తెలుసన్నారు. సనాతన ధర్మం గురించి మాట్లాడితే మత పిచ్చిగా అభివర్ణించడం ఆమె రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమన్నారు. రాష్ట్రాన్ని అసంబద్ధంగా విభజించి పాలించాలని చూసిన కాంగ్రెస్‌కు ఆమె రాష్ట్ర నాయకత్వం వహిస్తున్నార న్నారు. మరోసారి పవన్‌కు మత రాజకీయాలు అంటగట్టాలని చూస్తే సహించేది లేదని భవానీ హెచ్చరించారు.

త్రీటౌన్ ఎస్ఐ గోపాలుడు బదిలీ

అనంతపురం క్రైం, మార్చి17(ఆంధ్రజ్యోతి) : నగరంలోని త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ గోపాలుడు విజిలెన్స్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న శరత్‌చంద్రను నియమించారు. ఈ సందర్భంగా సోమవారం రిలీవ్ అయిన ఎస్ఐ గోపాలుడును సీఐ శాంతిలాల్, సిబ్బంది సన్మానించారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

నగరంలోని హౌసింగ్‌బోర్డులో ఓ మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైంది. ఉరవకొండ మండలం షేక్ షానుపల్లికి చెందిన గడపర్తి రామలింగమ్మకు గత కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేదు. కొన్ని రోజుల క్రితం నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని తనకు తెలిసిన వారి ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఆ ఇంటి నుంచి అదృశ్యమైంది. కుటుంబసభ్యులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇంటర్ విద్యార్థిని...

నగరంలోని తపోవనం ప్రాంతానికి ఓ అమ్మాయి ఇంటర్ సెకండియర్ చదువుతోంది. చివరి రోజు పరీక్ష పూర్తికాగానే పరీక్షా కేంద్రం నుంచి అదృశ్యమైంది. తల్లిదండ్రులు ఆ అమ్మాయి కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డంపింగ్‌యార్డ్‌ను తొలగించండి : సీపీఎం

నగరం సమీపంలోని డంపింగ్‌యార్డ్‌ను అక్కడి నుంచి తొలగించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం సందర్భంగా సీపీఎం నాయకులు కార్పొరేషన్ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వచ్చి అక్టోబరు 2వతేదీ లోగా డంపింగ్‌యార్డు సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు కిష్టప్ప, వెంకటనారాయణ, ముత్తుజ తదితరులు పాల్గొన్నారు.

పత్రాలు చూపి బైక్‌లు తీసుకెళ్లండి

నగరంలో కొన్ని ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని వాటికి సంబంధించి సరైన పత్రాలు చూపి తీసుకెళ్లాలని నాలుగో పట్టణ సీఐ సాయినాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023 నవంబరు 9న ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొన్ని వాహనాలు సీజ్ చేశామన్నారు. వాటిలో కొన్ని వాహనాలను యజమానులకు అప్పగించామన్నారు. మరికొన్ని వివరాలను ఆరా తీసినా యజమానుల వివరాలు తెలియలేదన్నారు. సంబంధిత గుర్తింపు కార్డులతో వాటిని తీసుకెళ్లాలని తెలిపారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

అనంతపురం క్రైం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం రాచానపల్లి చర్చి సమీపంలోని దుకాణంలో జరిగిన దొంగతనం కేసులో ముగ్గురు నిందితులను అనంతపురం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పది రోజుల క్రితం ఆ అంగట్లో రూ.15వేల విలువైన సిగరెట్లు, బిస్కెట్లు, చాక్లెట్లు దొంగతనం చేశారు. ఈ కేసులో నవోదయకాలనీకి చెందిన చాంద్‌బాషా, నరుద్రంపేట చెందిన తుషార్‌ను అరెస్ట్ చేశారు. మరో బాలుడిని జువైనల్ హోంకు తరలించారు.

సబ్‌స్టేషన్ సమీపంలో నిప్పు

రామగిరి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ కంచె చుట్టు ఉన్న చెత్తకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. చెత్తలో అధికంగా ప్లాస్టిక్ ఉండటంతో మంటలు ఎగిసి పొగ ఎక్కువగా కమ్ముకుంది. వెంటనే స్థానికులు సబ్‌స్టేషన్ సిబ్బందికలిసి మంటలు ఆర్పే ప్రయత్నంచేశారు. అక్కడికి సమీపంలో ఉన్న ఇళ్ల సర్వీసు వైర్లు కూడా కాలిపోయినట్టు స్థానికులు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ చుట్టు చెత్తనువేయడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

అనంతపురంరూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీల్లో ఈనెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. 19,20,21,22 తేదీల్లో వరుసగా ఉప్పరపల్లి, అనంతపురం రూరల్-1,2, గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తామన్నారు. 25న రుద్రంపేట-1, కక్కలపల్లి కాలనీ-1, రాచానపల్లి, కక్కలపల్లి రూరల్‌లో ఉంటాయన్నారు. 26న రుద్రంపేట -2, కక్కలపల్లి కాలనీ -2, రాచానపల్లి, కక్కలపల్లి రూరల్ పంచాయతీలో, 27న రుద్రంపేట-3, కురుగుంట, ఎన్.ఎస్.కుంట, కాటిగానికాలువ, 28న రుద్రంపేట-4, కామారుపల్లి, ఎన్ఎస్‌కుంట, ఆలమూరు పంచాయతీల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేతనాల్లో కోతపై ఆందోళన

అనంతపురం రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వేతనాల్లో కోతలపై ఆదాని కంపెనీలో పనిచేసే ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ఆ మేరకు సోమవారం రూరల్ మండలం పరిధిలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కంపెనీ కార్యాలయం, గోడౌన్ వద్ద ఉమ్మడి జిల్లా పరిధిలోని ఉద్యోగులు నిరసన తెలిపారు.

పన్ను వసూళ్లలో రూరల్ ప్రథమం : డీపీఓ

అనంతపురం న్యూటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) జిల్లాలోని అన్ని పంచాయతీలతో పోలిస్తే పన్నూ వసూళ్లకు సంబంధించి అనంతపురం రూరల్ ప్రథమ స్థానంలో ఉందని డీపీఓ నాగరాజనాయుడు పేర్కొన్నారు. ఆయన సోమవారం సాయంత్రం జిల్లా పంచాయతీ కార్యాలయం లోని తన చాంబర్‌లో డీఎల్‌పీఓ విజయ్‌కుమార్, ఈఓఆర్డీ వెంకటనాయుడుతో కలిసి రూరల్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

అడవుల పరిరక్షణలో నిర్లక్ష్యం తగదు : పీసీసీఎఫ్

అనంతపురం న్యూటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర వ్యాప్తంగా అగ్ని ప్రమాదాల నుంచి అడవులను కాపాడటంలో నిర్లక్ష్యం తగదని పీసీసీఎఫ్ ఏకే నాయక్ కన్జర్వేటర్లకు ఆదేశించారు. ఆయన సోమవారం రాష్ట్రంలోని కన్జర్వేటర్లలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అడవులను కాపాడటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అలాగే జూన్, జూలై నాటికి పంపిణీ చేసేలా నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే మంగళవారం ఉదయం 10.45 గంటలకు అనంతపురం సర్కిల్ పరిధిలోని డీఎఫ్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు సీఎఫ్ యశోదాబాయి సోమవారం ప్రకటనలో తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ఏఐవైఎఫ్ నిరసన

అనంతపురం విద్య, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు ఏపీ ప్రభుత్వం న్యాయం చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్రేష్ మాట్లాడుతూ.... ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరుద్యోగులకు ఎదురు చూపులు తప్పడం లేదన్నారు. కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు దేవా, ధనుంజయ, శ్రీనివాస్, రాంబాబు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి17(ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకం కింద ఉరవకొండ మండలం వై.రాంపురానికి చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నవీన్‌కు ఉద్యోగావకాశం కల్పించారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్ తన చాంబర్‌లో నవీన్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఉరవకొండ మండలంలోని చాబాల ఎస్సీ ప్రభుత్వ వసతిగృహంలో కుక్‌గా నియమించారు.

భూసేకరణ వేగంగా చేపట్టండి : కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అభివృద్ధి పనులకు సంబంధించి భూసేకరణ పనులను వేగంగా చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ భూసేకరణపై సోమవారం జేసీ శివనారాయణశర్మతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్‌హెచ్ 544డి, ఎన్‌హెచ్ 67, ఏపీట్రాన్స్‌కో, ఏపీజెన్‌కో, రైల్వే, పవర్‌గ్రిడ్, హెచ్‌ఎన్ఎస్ఎస్ తదితర ప్రాజెక్టులకు సంబంధించిన పనులకు భూసేకరణత్వరగా చేపట్టి భూములను అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్లు మోహన్‌కుమార్, హరి కుమార్, కలెక్టరేట్ సెక్షన్ ఆఫీసర్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పురోగతి చూపాలి

జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులలో పురోగతి చూపించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆయన సోమవారం అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి పథకంలో కేటాయించిన లక్ష్యాలను ఎక్కడా పెండింగ్‌లేకుండా పూర్తిచేయాలన్నారు. ఎండాకాలం కావడంతో కూలీలు పనిచేసేచోట తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే పదోతరగతి పరీక్షా కేంద్రాలలో ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చూడాలని ఆదేశించారు.

'మా సమస్యలు పరిష్కరించండి'

అనంతపురం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్నోఏళ్లుగా చిత్తశుద్ధితో పనిచేస్తూ, ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టులో పనిచేస్తున్న వివిధ కేడర్ల సిబ్బంది సోమవారం విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ... ఇది ప్రభుత్వ వ్యతిరేకం కాదని, తమ సమస్యలు ప్రభుత్వానికి తెలియజేయాలనే ఈ శాంతియుత నిరసన చేపట్టామన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టండి : సీపీఐ

అనంతపురం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ(ఆరోగ్యశ్రీ) ఉన్నా రోగుల నుంచి బలవంతంగా అదనంగా డబ్బులు దండుకుంటూ దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు శ్రీరాములు, రమణయ్య, అల్లీపీరా ఆధ్వర్యంలో సోమవారం బాధితులు, సీపీఐ శ్రేణులు నేరుగా గ్రీవెన్స్‌లో బైఠాయించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఈ ఘటనలను సీరియస్‌గా తీసుకొని తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో సీపీఐశ్రేణులు శాంతించి వెళ్లిపోయారు. అనంతరం సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీ, అక్రమాలపై చర్యలు తీసుకునే వరకు పోరాటంసాగిస్తామని హెచ్చరించారు. సీపీఐ నాయకులు సుందరరాజు, ఎల్లుట్ల నారాయణస్వామి, ఆచారి, రాజు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పారా ఖేలో ఇండియాకు నలుగురి ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో ఏడీ, సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి పారా ఖేలో ఇండియా పోటీలకు జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 20వ తేదీ నుంచి నుంచి నిర్వహించే జాతీయ స్థాయి పారా ఖేలో ఇండియా క్రీడా పోటీలకు జిల్లా నుంచి పారా క్రీడాకారులు సహన, సాకే బాబు, నీలం పల్లవి, సంజయ్‌రెడ్డి ఎంపికయ్యారు. వారిని సోమవారం జిల్లా విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ వినోద్ కుమార్ అభినందించారు.

కొరవడిన సమయపాలన

- హంద్రీనీవా, హెచ్చెల్సీ కార్యాలయాల్లో ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్న ఉద్యోగులు

ఆంధ్రజ్యోతి విజిట్


ఉదయం 10.48 గంటల సమయంలో హెచ్చెల్సీ లోక్ డివిజన్‌లో పరిస్థితి


హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్-7 కార్యాలయంలో ఉదయం 10.40 సమయంలో..

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి రోజూ ఉదయం 10గంటలకు కచ్చితంగా కార్యాలయాల్లో విధులకు హాజరు కావాలని ఉత్తర్వులు. అయితే వాటితో మాకు పనిలేదు... మేము వచ్చిందే టైం...వచ్చినప్పుడే విధులు నిర్వహిస్తామన్న చందంగా మారింది హంద్రీనీవా సుజల స్రవంతి పథకం, హెచ్చెల్సీ కార్యాలయాల్లో పనిచేసే ఇంజనీర్లు, ఉద్యోగుల తీరు. ఈ తతంగం సోమవారం ఆంధ్రజ్యోతి విజిట్‌లో తేటతెల్లమైంది. హెచ్చెల్సీ కాలనీలోని హెచ్ఎన్ఎస్ఎస్, హెచ్చెల్సీ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఉదయం 12గంటలైనా విధులకు హాజరు కాలేదు. హెచ్చెల్సీ పరిధిలో ఎస్ఈ కార్యాలయం, లోక్ డివిజన్, ధర్మవరం బ్రాంచ్‌కెనాల్, డిప్యూటీ ఎస్ఈ కార్యాలయం, హెచ్చెల్సీ డివిజన్ పరిధిలోని పీఏబీఆర్‌కు సంబంధించి సబ్‌డివిజన్లలో ఇంజనీర్లు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇక హంద్రీనీవా కార్యాలయంలో డివిజన్-6, డివిజన్-7 కార్యాలయాలతో పాటు ఎస్ఈ, డిప్యూటీ ఎస్ఈ, జలవనరుల శాఖ ప్రాజెక్ట్ సీఈ, డిప్యూటీ సీఈ కార్యాలయాలలో ఇంజనీర్లు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. అయితే కొందరు ప్రజాసమస్యల పరిష్కార వేదిక పేరుతో, మరికొందరు వ్యక్తిగత పనులంటూ, ఇంకొందరు టీ స్టాల్, చెట్ల కింద కాలయాపన చేస్తున్నారు. కొందరు ఉద్యోగ సంఘాల పేరుతో విధులకు ఆలస్యంగా రావడం, దుమ్మా కొట్టడం పరిపాటిగా మారింది. హెచ్చెల్సీ, హంద్రీనీవా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తూవస్తున్నారు. దీంతో విధులకు హాజరు కావాల్సిన ఇంజనీర్లు, ఉద్యోగులు ఆడిందే ఆటగా...పాడిందే పాటగా పరిస్థితిని మార్చేసుకున్నారు.

ఇక కొందరు ఇంజనీర్లు, ఉద్యోగులు వే లాది రూపాయలు జీతాలు తీసుకుంటూ కనీసం రోజుకు రెండు గంటల కూడా ప్రభుత్వ విధులు నిర్వహించడం లేదనే ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రంలోనే ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరు పరిస్థితి ఇలా ఉంటే నియోజకవర్గాలు, మండలాల్లో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

సంక్షిప్త వార్తలు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి: సీపీఐ



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

గుంతకల్లుటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బీ వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద సోమవారం సీపీఐ నాయకులు, కార్యకర్తలో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 11 ఏళ్ల నుంచి ఎన్డీఏ ప్రభుత్వం ప్రైవేటీకరణకు మొగ్గుచూపుతోందన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయరాదంటూ గత 1700 రోజులుగా పలు కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు ఉద్యమాలు చేస్తూనే ఉన్నారన్నారు. గతంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సైతం ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని, కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆహామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్దకు బైక్‌యాత్ర

గుంతకల్లు టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల వద్దకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బైక్ యాత్ర నిర్వహించారు. పట్టణంలోని హంపిరెడ్డి భవనం నుంచి సోమవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నాయకులు పనుల వద్దకు బైక్ యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని నెలగొండ, వెంకటాంపల్లి గ్రామంలో జరిగే పనుల వద్దకు వెళ్లి అక్కడి కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, పనులు చేసేచోట సౌకర్యాలు లేవని పలువురు కూలీలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మారుతిప్రసాద్, కసాపురం రమేష్, రాము నాయక్, సురేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా లోక్‌నాథ్ శర్మ



గుంతకల్లుటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన టీవీ లోక్‌నాథ్ శర్మ ఎన్నికయ్యారు. కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని ఆర్యవైశ్య వాసవీ కల్యాణ మండపంలో గత ఆదివారం బ్రాహ్మణ సంఘం రాష్ట్రస్థాయి కమిటీ ఎన్నిక జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన కోనూరు సతీష్‌శర్మ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా టీవీ లోక్‌నాథ్ శర్మ, ప్రధాన కార్యదర్శిగా కర్నూలుకు చెందిన హెచ్‌కే మనోహర్, కోశాధికారిగా విజయవాడకు చెందిన ప్రసాద్ శర్మ ఎన్నిక కాగా.. మరో 11మందిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి శర్మ సోమవారం తెలిపారు.

విజయవాడలో ర్యాలీకి తరలిరండి

గుంతకల్లుటౌన్, మార్చి17(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈనెల 19వతేదీన విజయవాడలో ర్యాలీ జరగనుందని, అగ్రిగోల్డ్ బాధితులు పెద్దఎత్తున తరలిరావాలని సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం జరిగింది. ఇందులో గోపీనాథ్ పాల్గొని మాట్లాడారు. సమస్య పరిష్కారం కోసం అగ్రిగోల్డ్ బాధితులు కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అగ్రిగోల్డ్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు వెంకటేష్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, బాధితులు పాల్గొన్నారు.

వైద్యులను నియమించాలని వినతి

తాడిపత్రి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు వైద్యులను నియమించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ రజాక్‌వలిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక టైలర్స్‌కాలనీ, పాతకోట, అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో రెండేళ్ల నుంచి వైద్యులు లేరని, దీంతో వైద్య సేవలందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా వైద్యుల నియామకానికి కృషి చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు నాగేంద్ర, సూరి, రమణ, రత్నమయ్య, అబ్రహం, నాగార్జున, శివ తదితరులు ఉన్నారు.

సీసీరోడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

పుట్లూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో సీసీరోడ్ల నిర్మాణాలను వెంటనే చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ అలివేలమ్మ ఇన్‌చార్జి మండల ఇంజనీర్‌ను ఆదేశించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆమె ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడారు. ప్రతి పంచాయతీకి మంజూరైన నిధులను దుర్వినియోగం చేయకుండా సిమెంట్‌రోడ్ల నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఎక్కడా అవకతవకలు జరగకూడదని హెచ్చరించారు. ఎన్ఆర్‌జీఎస్ నిధులను పూర్తి చేస్తే మరొక గ్రాంట్ మంజూరయ్యే అవకాశం ఉందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

బొమ్మనహాళ్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దర్గాహొన్నూరు, మల్లాపురం గ్రామాలకు చెందిన విద్యార్థులు బొమ్మనహాళ్‌లో పదో తరగతి పరీక్షలు రాసి స్వగ్రామాలకు బైక్‌లో బయలుదేరారు. గోవిందవాడ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో రంజిత్, సురేష్‌కు తీవ్రగాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. సకాలంలో బస్సులు లేకపోవడం వల్లే తమ పిల్లలు బైక్‌లో పరీక్షలకు వెళ్లాల్సి వచ్చిందని తల్లిదండ్రులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం చూపండి

బొమ్మనహాళ్, మార్చి17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటకు స్థలం చూపాలని అంబేడ్కర్ సేన, దళిత, గిరిజన హక్కుల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సాకే రమేష్, కేసీ పవన్, ఉమేష్, వన్నూరుస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలి: ఆర్డీఓ

కళ్యాణదుర్గం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజలు అర్జీల ద్వారా తెలిపే ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆర్డీవో వసంత బాబు అధికారులకు సూచించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఆయన గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి వారం లోపు సమస్య పరిష్కరించాలని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



అర్షియా

తాడిపత్రి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో ఈనెల 16వ తేదీన ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ వారు నిర్వహించిన బాలికల కబడ్డీ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో తాడిపత్రికి చెందిన విద్యార్థి అర్షియ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఆ విద్యార్థిని పట్టణంలోని సంజీవనగర్‌లో ఉన్న సాయిచైతన్య పాఠశాలలో చదువుతోంది. ఆమెను సోమవారం పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనరసింహ అభినందించారు.

పురాతన ఆలయాల పరిరక్షణకు ఎమ్మెల్యే కృషి

- మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి
- బుగ్గ రామలింగేశ్వరాలయానికి మరమ్మతులు



మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాల పరిరక్షణకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, ఆలయాల మరమ్మతుల కోసం ఆయన ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఆర్కియాలజీ వారితో అనుమతి తీసుకొచ్చారని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తొలుత స్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇప్పటికి బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం నిర్మించి దాదాపు 600 ఏళ్లు అయిందని, అయితే అక్కడక్కడ మరమ్మతులకు గురవడంతో ఎమ్మెల్యే చొరవతో పనులు చేయిస్తున్నామని తెలిపారు. పురాతన ఆలయాలను కాపాడుకోవాల్సి బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంతోపాటు చింతల వెంకటరమణస్వామి, అశ్వత్థనారాయణస్వామి, ఆలూరుకోన రంగ నాథస్వామి, లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయాలను కూడా అందరి సహకారంతో మరమ్మతులు చేపడతామని చెప్పారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, చందు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

- తొలిరోజు పలువురు విద్యార్థుల గైర్హాజరు



పామిడిలోని ఓ కేంద్రంలో పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం అన్ని చోట్ల ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. కేంద్రాలను స్క్వాడ్‌లు తనిఖీ చేశారు. కాగా తొలిరోజున తెలుగు పరీక్షకు పలు కేంద్రాల్లో కొందరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓలు తెలిపారు.

- విడపనకల్లు మండలంలో మొత్తం 658 మంది విద్యార్థులకు గాను 621 మంది పరీక్షలు రాశారు. 37 మంది గైర్హాజరయ్యారు.
- పామిడి మండలంలో మండలంలో 796 మందికి గాను ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.
- ఉరవకొండ పట్టణంతో పాటు మండలవ్యాప్తంగా 1083 మంది గాను 1069 మంది హాజరయ్యారు. 14 మంది గైర్హాజరయ్యారు. వజ్రకరూరు మండలంలో 639 మంది విద్యార్థులకు గాను628 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారు.
- కూడేరులో 285 మందికి గాను 283 మంది హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరయ్యారు.
- గుంతకల్లు పట్టణంతో పాటు మండలవ్యాప్తంగా 2225 మందికి గాను 2,206 మంది పరీక్షలు రాశారు. 19 మంది గైర్హాజరయ్యారు.
- పెద్దపప్పూరు మండలంలో 397మందికి గాను 388మంది పరీక్షలు రాశారు. 9మంది గైర్హాజరయ్యారు.
- యాడికి మండలంలో 784 మందికిగాను 775 మంది పరీక్షలు రాశారు. 9 మంది గైర్హాజరయ్యారు.
- కణేకల్లు మండలంలో 964 మందికి గాను 951 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు.
- బొమ్మనహాళ్ మండలంలో 874 మంది విద్యార్థులకు గాను 860 మంది పరీక్షలు రాశారు. 14 మంది గైర్హాజరయ్యారు.
- శెట్టూరు మండలంలో 380 మందికి గాను 377 మంది పరీక్షరాశారు. ముగ్గురు గైర్హాజరయ్యారు.
- కుందుర్పి మండలంలో 596మందికి గాను 586 మంది పరీక్షకు హాజరయ్యారు. 10 మంది గైర్హాజరయ్యారు.
- పెద్దవడుగూరు మండలంలో 466మందికి గాను 461 మంది పరీక్షలు రాశారు. ఐదుగురు గైర్హాజరయ్యారు.
- గుత్తి పట్టణంతో పాటు మండలవ్యాప్తంగా 1566 మందికి గాను 1535 మంది పరీక్షలు రాశారు. 31మంది గైర్హాజరయ్యారు.
- బ్రహ్మసముద్రం మండలంలో 377 మందికి గాను 374 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు.
- రాయదుర్గం పట్టణంతో పాటు మండలవ్యాప్తంగా 1480 మందికి గాను 1454మంది పరీక్ష రాశారు. 26 మంది గైర్హాజరయ్యారు.
- డీ.హీరేహాళ్ మండలంలో 531 విద్యార్థులకు గాను 516 మంది పరీక్ష రాశారు. 15 మంది గైర్హాజరయ్యారు.

వైభవంగా ఎర్రితాత రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



స్వామిని దర్శించుకుంటున్న పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వై.రాంపురం గ్రామంలో ఎర్రితాత రథోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అర్చకులు ఆలయంలోని స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చి ఆలయం నుంచి బొడ్రాయి వరకూ లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. భక్తులు రథంపైకి అరటిపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఎర్రితాత స్వామిని టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు దర్శించుకుని పూజలు చేయించారు. కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



చిన్నముష్టూరు వద్ద హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఉరవకొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆరువేల క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి, డిస్ట్రిబ్యూటర్లు త ద్వి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని సీపీ ఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చే శారు. మండలంలోని చిన్నముష్టూరు, ఇంద్రావతి గ్రామాల్లో జరుగుతున్న కాలువ వెడల్పు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను సీపీఎం స్వాగతిస్తోందన్నారు. ఎన్నికల ముందు నాయకులు 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు పాత డిజైన్ ప్రకారం 3,850క్యూసెక్కులకే కాలువను వెడల్పు చేస్తున్నారని, దీనివల్ల రైతులకు ఒరిగిందేమి లేదని అన్నారు. కనీసం 6వేల క్యూసెక్కుల సామర్థ్యంతోనైనా కాలువ వెడల్పు చేసి, పిల్లకాలువ పనులు కూడా ప్రారంభించాలని అన్నారు. ఇప్పుడు కాలువ వెడల్పు చేస్తే మరో 15ఏళ్ల వరకూ వెడల్పు చేసే అవకాశముండదని పేర్కొన్నారు. వరద నీరు రాయలసీమ భూములకు రావాలంటే కాలువ వెడల్పు తప్పా మరో మార్గం లేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, శీనప్ప, మురళి, కౌలు రైతు సంఘం నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోండి

పుట్లూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయాల్లో ఏర్పాటుచేసే ఆధార్‌కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సోమవారం ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు. 19, 20న పుట్లూరు, కడవకల్లు, 21, 22న పుట్లూరు, చెర్లోపల్లి, 25న అరకటవేముల, కోమటికుంట్ల, 26న బాలాపురం, అరకటవేముల, 27, 28 శనగలగూడూరు, కందికాపుల సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు.

అగ్ని ప్రమాదంపై విచారణ



దగ్ధమైన ఫైళ్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ ఏడీ కార్యాలయంలో గత ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంపై ఆర్ఎఫ్ఎస్ఎల్ బృందం, క్లూస్‌టీం సోమవారం విచారణ చేపట్టారు. ఉదయాన్నే వారు ఏడీ కార్యాలయం వద్దకు చేరుకుని అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశంలో నమూనాలను సేకరించారు. ఆర్ఎఫ్ఎస్ఎల్ సైంటిఫిక్ అసిస్టెంట్లు జయరాజ్, కుళ్లాయ మ్మ ఏడీఏ కార్యాలయాన్ని పరిశీలించి ప్రమాద సంఘటన వివరాలను సీఐ మహానందిని అడిగి తెలుసుకున్నారు. మంటలు ఎక్కడ ప్రారంభమయ్యాయి, ఎక్కడ వరకూ వ్యాపించిన ప్రదేశాన్ని పరిశీలించారు. అయితే ఏడీఏ కార్యాలయంలో రికార్డులు దగ్ధం కావడం చర్చాంశనీయంగా మారింది. ఈ అగ్ని ప్రమాదం ప్రమాదవశాత్తూ జరిగిందా.. కుట్ర దాగి ఉందా అనే కోణంలో విచారణ చేపట్టా రు. 2013కు ముందున్న ఫైల్స్, రికార్డులు దగ్ధమైనట్లు ప్రాథమికంగా అధికారులు అంచనా కు వచ్చారు. దగ్ధమైన రికార్డులలో రాయితీ ప రికరాలకు సంబంధించిన ఫైల్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఏడీఏ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ విషయంపై ఏడీఏ పద్మజను వివరణ అడగ్గా అగ్ని ప్రమాదంలో ఏ ఫైల్స్ దగ్ధమయ్యాయో గుర్తించే పనిలో ఉన్నామన్నారు. 2021వరకూ కూడా ఫైళ్లన్నంటినీ కూడా ఆడిట్ చేశామని ఆమె తెలిపారు.

కుట్ర దాగి ఉంది: టీడీపీ

ఏడీఏ కార్యాలయంలో అగ్ని ప్రమాదం వెనుక కుట్ర కోణం దాగి ఉ ఉందని టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, రేగాటి నాగరాజు, విజయ్‌భాస్కర్ ఆరోపించారు. అగ్ని ప్రమాదం జరిగిన ఏడీఏ కార్యాలయాన్ని వారు పరిశీలించారు. అగ్ని ప్రమాదంలో అధికారులు, వైసీపీ నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. వైసీపీ హయాంలో జరిగిన అవకతవకలను కప్పిపుచ్చుకునేందుకే ఫైళ్లను దగ్ధం చేసి ఉండవచ్చుననే అనే అనుమానాలు వ్యక్తం వ్యక్తమవుతున్నాయని అన్నారు. ప్రమాదంపై సమగ్ర విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మారెన్న, సుంకన్న, గోవిందు, నరేష్, రామాంజనేయులు, వరప్రసాద్, రాజశేఖర్, సూరి పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

కూడేరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. నాగిరెడ్డిపల్లి, అంతరగంగ గ్రామాలకు చెందిన 15 మంది విద్యార్థులకు ఆర్డీటీ సంస్థ వారు సైకిళ్ల పంపిణీ చేశారు. ఆ గ్రామాల విద్యార్థులు నిత్యం ఇప్పేరు యూపీ పాఠశాలకు కాలినడకన వచ్చిపోతున్నారు. విషయం తెలుసుకున్న ఆర్డీటీ వారు సోమవారం పాఠశాలకు వెళ్లి సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సాయికృష్ణ, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

రథం తయారీకి విరాళాలు

కూడేరు, మార్చి 17, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయ రథం తయారీకి స్థానిక దళితకాలనీ వాసులు రూ.50.116లను విరాళంగా అందజేశారు. సంగప్ప రూ, 5.116లను అందించగా.. మిగతా వారు మిగిలిన నగదును ఆలయ అర్చకుడు మహేష్, రథం అభివృద్ధి కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు.

ఆలయానికి కూలర్ల వితరణ

ఉరవకొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఉరవకొండ పట్టణానికి చెందిన కెనరా బ్యాంక్ మేనేజర్ కిశోర్ కూలర్లను వితరణ చేశారు. ఆలయంలో సోమవారం ఈవో రమేష్ బాబుకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.2లక్షలు విలువ చేసే రెండు కూలర్లు, ఫ్లడ్ లైట్లు, వైరింగ్ మెటీరియల్ వితరణ చేసినట్లు చెప్పారు. కెనరా బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

రాయదుర్గంరూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎలాంటి నేరాల నియంత్రణకు వ్యాపారులు తమ షాపులకు సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు సూచించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన పలు దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏదైనా నేరాలు జరిగినపుడు వాటిని అధిగమించాలంటే సీసీకెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పట్టణంలో ప్రతి దుకాణం యాజమాని సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అర్బన్ సీఐ జయనాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బొమ్మనహాళ్,మార్చి17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయ ఆవరణంలో సోమవారం చలివేంద్రాన్ని తహసీల్దార్ మునివేలు ప్రారంభించారు. కార్యాలయానికి వచ్చి వారి దాహార్తిని తీర్చడానికి ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్, ఆర్ఐ బాలక్రిష్ణ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఆడిట్

రాయదుర్గంరూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఆడిట్ జరిగినట్లు ప్రిన్సిపాల్ రఘురామమూర్తి తెలిపారు. ఇందులో ఇద్దరు ఆడిటర్లు రికార్డులను పరిశీలించారన్నారు. కళాశాలలోని అన్ని విభాగాలలో అవసరమైన రికార్డులన్నింటినీ పరిశీలించారని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

బెళుగుప్ప, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సొంత స్థలమున్న వారు ఇంటి పొజిషన్ ధృవీకరణ పత్రానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ షర్మిల సోమవారం తెలిపారు. ప్రభుత్వ గృహాల మంజూరుకు 983 మంది అర్హత పొందారని, వీరందరూ ఇంటి పొజిషన్ సర్టిఫికెట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. విచారించి మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చెన్నకేశవ స్వామికి శయనోత్సవ సేవ



శయనోత్సవ సేవలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

యాడికి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి శయనోత్సవ సేవను నిర్వహించారు. ఈ సందర్భం గా ఉదయమే అర్చకులు ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. మాజీ ఉపసర్పంచు బాలారమేష్‌బాబు ఆధ్వర్యంలో శయనోత్సవ సేవను నిర్వహించారు. శయనోత్సవ సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బంగారు నగల అదృశ్యంపై ఫిర్యాదు

గుత్తి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన శ్రావణి అనే మహిళ బస్సులో ప్రయాణిస్తుండగా పది తులాల బంగారు ఆభరణాలు అదృశ్యమయ్యాయి. ఈ మేరకు బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. యాడికిలోని చెన్నకేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఆమె తన భర్త, కుటుంబసభ్యులతో కలిసి వెళ్లింది. ఉత్సవాలు ముగించుకొని గుత్తికి బస్సులో వచ్చింది. బస్టాండ్‌లో బస్సు దిగగానే తన బ్యాగ్‌ను పరిశీలించగా.. అందులోని పది తులాల బంగారునగలు కనిపించలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ఏఎస్ఐ రామాంజనేయులు, కానిస్టేబుల్ భాస్కర్‌నాయుడు బస్టాండ్‌లో సీసీ కెమెరాలను పరిశీలించారు.

వర్మీకంపోస్ట్ తయారీపై అవగాహన

గుత్తి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎల్ ల్యాబ్‌లో వర్మీ కంపోస్ట్ తయారీ విధానంపై సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ ఆత్మ పీడీ మద్దిలేటి మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్రలో భాగంగా వర్మీ కంపోస్ట్‌ను ఇంటివద్దనే వ్యర్థాల ద్వారా తయారు చేయవచ్చునని తెలిపారు. అలాగే కిచెన్ గార్డెన్ పెంపకంపై వివరించారు. ఏడీఏ వెంకటరాముడు, డీఆర్సీ శైలజకుమారి, ఏఓలు శ్రీనివాసులు, రుక్సానాబేగం, మహబుబ్‌బాష, మెహారున్నీసా, ఆత్మపీడీఎం లావణ్య, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సబ్ జైలును జిల్లా లీగల్ సర్వీసు అథారిటీ సెక్రెటరీ శివప్రసాద్ యాదవ్ సోమవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా అక్కడి ఖైదీలతో మాట్లాడి సమస్యలపై ఆరాతీశారు. 21 ఏళ్ల వయసులోపు నేరస్థులు ఎవరైనా ఉంటే మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్‌కు వివరాలు తెలపాలని అధికారులకు సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీచేశారు. న్యాయవాది తిమ్మప్ప, సబ్జైల్ సూపరింటెండెంట్ ధనుంజయనాయుడు, అనంతపురం కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోండి

రాయదుర్గంరూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వేసవిలో పట్టణంలో ఏ వార్డులోనూ నీటి సమస్య రాకుండా తగుచర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళు శిల్ప అధికారులకు సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆమె అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేసవిలో పట్టణంలో ఏవార్డులోనూ నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇందుకు స్టాండ్‌బై మోటార్లను స్టాండ్ బై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పలు వార్డులలో వీధిదీపాలు వెలగడం లేదని మరమ్మతులు చేయాలని చెప్పారు. డీఈ రవిప్రకాష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

యల్లనూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో లక్ష్మీ వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవదాయశాఖ అధికారి మురళీకృష్ణ అంకురార్పణ చేసి ప్రారంభించారు. 10రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో కల్యాణోత్సవం, రథోత్సవం కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కణేకల్లు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లో దాదాపు రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన ఆలయంలో పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామునే అర్చకులు పంచముఖ ఆంజనేయస్వామితోపాటు గణపతి, నరసింహ స్వామి, నాగ ప్రతిమలు, శివపార్వతుల విగ్రహాలు, నవగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ చేశారు. అలాగే ఆ విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ గావించి శాంతిహోమం, బలి పూర్ణాహుతి కుంబాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ఆంజనేయస్వామి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు పొందారు. విప్ కాలవ శ్రీనివాసులు కుమారుడు కాలవ భరత్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే పాటిల్ వేణుగోపాల్‌రెడ్డి కుమారుడు పాటిల్ అజయ్‌రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు పెద్దమ్మ జాతర

బెళుగుప్ప, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలువపల్లిలో పెద్దమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక అమ్మవారి ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

విజ్ఞాన విహార యాత్రకు ఎంపిక

బొమ్మనహాళ్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులో ఈ నెల 20, 21 తేదీలలో జరిగే విజ్ఞాన విహార యాత్రకు మండల కేంద్రంలోని కేజీబీవీలో 8 వతరగతి చదువుతున్న ఆర్ పూజిత, కే జయలక్ష్మి ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ కమలమ్మ తెలిపారు. ఫిబ్రవరి 3న జిల్లా స్థాయిలో జరిగిన సైన్స్‌ఫేర్‌లో ఆ విద్యార్థినులు ప్రతిభ కనబరిచడంతో విజ్ఞాన విహార యాత్రకు ఎంపికయ్యారని అన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలి

రాయదుర్గంరూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కారించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం అరంగట సేపు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ కార్మికుల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలన్నారు. లేకపోతే కార్మికులందరూ విధులను బహిష్కరించి సమ్మెబాట పట్టడం ఖాయమని హెచ్చరించారు. పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కరాటేలో తాడిపత్రి వాసుల ప్రతిభ

తాడిపత్రి, మార్చి17(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో ఈనెల 16వ తేదీన జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో తాడిపత్రికి చెందిన మార్షల్ ఆర్ట్స్ జపాన్ షూటోరియా కరాటే ట్రైనింగ్ స్కూల్ విద్యార్థులు 16మంది ప్రతిభ చూపారని కోచ్ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తెలిపారు. ప్రతిభ చూపిన హరిప్రియ, శిరీష, నారాయణి, వర్షిణి, మిధున్‌రెడ్డి, నందకిషోర్, తరుణ్‌తేజ్, మనోహర్‌రెడ్డితోపాటు మరికొంతమందికి సర్టిఫికెట్లు, ట్రోఫీలను ప్రదానం చేశారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను తల్లిదండ్రులు అభినందించారు.



సర్టిఫికెట్లను చూపుతున్న క్రీడాకారులు